నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 15-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 265 పేజీలు:6 వెల: రూ.1/-

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జి వీసీగా వాకాటి కరుణ

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జి వీసీగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ గుప్తా ఇటీవలే చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు.నిజామాబాద్ జిల్లా భీంగల్ పరీక్షా కేంద్రం ఏర్పాటు కోసం దాసరి శంకర్ అనే వ్యక్తి నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా రవీందర్ గుప్తాను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత విజిలెన్స్ అధికారులు ఒకట్రెండు సార్లు యూనివర్సిటీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వీసీకి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పామని వర్సిటీకి వచ్చిన చాలా మందిని విజిలెన్స్ అధికారులు విచారించారు. అలాగే యూనివర్సిటీ ఖాతాల లావాదేవీలను కూడా నిశితంగా పరిశీలించారు. గతంలో వర్సిటీలో పని చేసిన రిజిస్ట్రార్లను విచారించి, పలు కీలక విషయాలను రాబట్టారు. వీటన్నింటిని పరిశీలించి పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు ఇచ్చారు.

చంద్రయాన్-3 మనదేశ ప్రజల ఆశలను మరియు కలలను నెరవేర్చుతుంది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 14:చంద్రగ్రహాని కి భారతదేశం చేపట్టిన మూడో లూనర్ మిశన్ 'చంద్రయాన్-3' యొక్క ప్రాముఖ్యాన్ని గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు.

''భారతదేశం యొక్క అంతరిక్ష రంగం గురించి ప్రస్తావించవలసి వస్తే, 2023 జులై 14 వ తేదీ ని సదా సువర్ణాక్షరాల తో లిఖించడం జరుగుతుంది. మన మూడో చంద్ర గ్రహ సాహస యాత్ర అయినటువంటి చంద్రయాన్-3 తన ప్రస్థానానికై బయలుదేరనుంది. ఈ ప్రశంసనీయమైనటువంటి మిశన్ మన దేశ ప్రజల ఆశల ను మరియు స్వప్నాల ను ముందుకు తీసుకు పోతుంది.

కక్ష్య లోకి పంపే ప్రక్రియ తరువాత చంద్రయాన్-3 ను లూనార్ ట్రాన్స్ ఫర్ ట్రాజెక్టరీ లోకి ప్రవేశపెట్టడం జరుగుతుంది. 3,00,000 కిలో మీటర్ ల పై చిలుకు దూరాన్ని దాటి ఇది రాబోయే కొన్ని వారాల లో చంద్రుడి ని చేరుకొంటుంది. చంద్రయాన్ కు అమర్చినటువంటి వైజ్ఞానిక ఉపకరణాలు చంద్రగ్రహం ఉపరితలాన్ని అధ్యయనం చేయడం తో పాటు మన జ్ఞానాన్ని పెంపొందింప చేస్తాయి.

మన శాస్త్రవేత్త ల చలవ తో, అంతరిక్ష రంగం లో భారతదేశం యొక్క ఇతిహాసం చాలా సమృద్ధమైంది గా ఉంది. చంద్రయాన్-1 ని ప్రపంచం లో చంద్ర గ్రహం తాలూకు మిశన్స్ లో ఒక మార్గదర్శి అని భావించడం జరుగుతున్నది. ఎందుకంటే అది జాబిల్లి ఉపరితలం పైన జల సంబంధి అణువులు ఉన్నాయి అని రూఢిపరచింది. ప్రపంచమంతటా 200 కు పైచిలుకు విజ్ఞానశాస్త్ర సంబంధి ప్రచురణల లో దీనిని గురించిన ప్రస్తావన ఉంది.

చంద్రయాన్-1 కి పూర్వం , చంద్ర గ్రహం పూర్తి గా ఎండిపోయినటువంటిది అని, భౌగోళిక పరంగా నిష్క్రియం మరియు నిర్జన ఖగోళ పిండమని నమ్మే వారు. ఇక, దీనిని జలం ఉనికి కలిగినటువంటి మరియు అనుబంధ పొరల లో మంచు ఆనవాళ్లతో పాటు ఒక గతిశీలమైనటువంటి మరియు భౌగోళికం గా అది ఒక చురుకైన ఖగోళీయ ఖండమని లెక్కకు తీసుకోవడం జరుగుతోంది. బహుశా భవిష్యత్తు లో దీని పైన నివాసాల ను ఏర్పరచుకోవడమనేది సాధ్యం కావచ్చు!

చంద్రయాన్-2 కూడా అంతే ముఖ్యమైంది గా ఉండింది. ఎందుకంటే దీనికి జోడించిన ఆర్బిటర్ నమోదు చేసినటువంటి డేటా తొలి సారి రిమోట్ సెన్సింగ్ మాధ్యం ద్వారా క్రోమియమ్, మేంగనీజ్ మరియు సోడియమ్ ఉనికి ని పసిగట్టింది. ఇది చందమామ యొక్క మేగ్నేటిక్ వికాసం గురించిన సమాచారం మరింత గా తెలియగలదు.

చంద్రయాన్ యొక్క ప్రముఖ వైజ్ఞానిక పరిణామాల లో చంద్ర గ్రహం మీద సోడియం తాలూకు తొలి ప్రపంచ మానచిత్రం, క్రేటర్ ఆకారాల సమూహం తాలూకు అధిక సమాచారం, ఐఐఆర్ఎస్ ఉపకరణం అండ తో చంద్రుని ఉపరితలం మీద నీటి తో ఏర్పడిన మంచు యొక్క స్పష్టమైన రూపు ను వెదకడం మరియు ఇంకా ఎన్నో అంశాలు భాగం గా ఉన్నాయి. ఈ మిశను ను గురించి ఇంచుమించు 50 ప్రచురణల లో వివరించడం జరిగింది.

చంద్రయాన్- 3 మిశన్ కై ఇవే శుభాకాంక్షలు. ఈ మిశను ను గురించి, మరి అలాగే అంతరిక్షం, విజ్ఞానశాస్త్రం, ఇంకా నూతన అన్వేషణ.. వీటిలో దేశం సాధించిన ప్రగతి ని గురించి మరింత ఎక్కువ గా విషయాల ను తెలుసుకోవలసిందంటూ మీకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. దీనితో మీ అందరి కి బోలెడంత గర్వం కలుగుతుంది.'' అని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. అదేవిధంగా వెయిటింగ్‌లో ఉన్న పలువురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు కూడా ఇచ్చింది. ఈ బదిలీలు, పోస్టింగులు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31 మంది ఐఏఎస్ అధికారులు నూతన బాధ్యతలు చేపట్టబోతున్నారు. 1990 బ్యాచ్‌కు సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శశాంక్ గోయల్‌ను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. అదేవిధంగా యువజన సర్వీసులు, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శిగా శైలజా రామయ్యర్, ఆయుష్ డైరెక్టర్‌గా దాసరి హరిచందన, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య నియమితులయ్యారు.ఇక తెలంగాణ స్టేట్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ, భద్రాచలం ఐటీడీఏ పీవోగా ప్రతీక్ జైన్, సెర్ప్ సీఈవోగా పాట్రు గౌతమ్, గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శిగా నవీన్ నికోలస్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మంద మకరందు, ములుగు కలెక్టర్‌గా ఐలా త్రిపాఠి, పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా ముజమిల్ ఖాన్, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శిగా కె. హరితను నియమించారు.హస్త కళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా అలగు వర్షిణి, క్రీడల డైరెక్టర్‌గా కొర్రా లక్ష్మి, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్‌గా హైమావతి, పర్యాటక శాఖ డైరెక్టర్‌గా కే నిఖిల, వ్యవసాయ శాఖ ఉప కార్యదర్శిగా సత్య శారదాదేవి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా స్నేహ శబరిష్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ప్రియాంక ఆల, మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్‌గా వెంకటేశ్ ధోత్రే నియమితులయ్యారు.అదేవిధంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న కే స్వర్ణలతను జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బదిలీ చేశారు. అభిలాష అభినవ్‌ను ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్‌గా, కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా మను చౌదరిని, టీఎస్ దివాకరను జగిత్యాల అదనపు కలెక్టర్‌గా, అనుదీప్ దురిశెట్టిని హైదరాబాద్ కలెక్టర్‌గా నియమించారు.నాగర్ కర్నూల్ అదనపు కలెక్టర్‌గా కుమార్ దీపక్, పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా చెక్క ప్రియాంక, కరీంనగర్ అదనపు కలెక్టర్‌గా జల్దా అరుణశ్రీ, సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా బదుగు చంద్రశేఖర్, రంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా ప్రతిమా సింగ్, సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా గరిమా అగర్వాల్ నియమితులయ్యారు.

నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

తం॥ జనవారు ధనగా రజ్జుము
చెలి చూపగ దేశము నకు సంసేవనమున
ప్రతిమల 'భారతరత్న'ను
జనవారు లాలన కొనగిన నిన్దిన యిదియే!!

-రాధశ్రీ

(జులై 15 మొట్టమొదటి "భారతరత్న"ను రాష్ట్రపతి చేతుల మీదుగా జవహర్‌లాల్ నెహ్రూకు ప్రదానంచేసిన రోజు..)

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంపై హర్షం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, జులై 14: హైదరాబాద్, జులై 14: శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నిర్వహించిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైంది. చంద్రయాన్-3ని ఇస్రో విజయవంతంగా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇతర సాంకేతిక సిబ్బందిని అభినందిస్తూ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడం ద్వారా భారత అంతరిక్ష పరిశోధన రంగం.. కీలక మైలురాయిని దాటిందని సీఎం అన్నారు.

ఇస్రో మరో రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. చంద్రుడి దిశగా చంద్రయాన్-3(అష్టజీనితతీజీఎజీజీని-3) పయనమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ సెంటర్ నుంచి ఇవాళ ఎల్‌వీఎం3 ఎం4 రాకెట్ నింగిలోకి దూసుకువెళ్లింది. చంద్రయాన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ఆ రాకెట్ మోసుకువెళ్లింది. ఇవాళ మధ్యాహ్నం 2.35 నిమిషాలకు రాకెట్ గాలిలోకి ఎగిరింది. ఆ తర్వాత అన్ని దశల్లోనూ ఆ రాకెట్ బూస్టర్లు సక్రమంగా మండాయి. ల్యాండర్, రోవర్‌తో చంద్రయాన్-3 వెళ్తోంది. ఆగస్టు 23వ తేదీన చంద్రుడిపై ఆ ల్యాండర్ దిగే అవకాశాలు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలాన్ని అధ్యయనం చేసేందుకు పేలోడ్‌లో ప్రత్యేక పరికరాన్ని పంపుతున్నారు.

కేసీఆర్ వెంటే తెలంగాణ రైతన్నలు : మంత్రి తలసాని

హైదరాబాద్, జులై 14:సీఎం కేసీఆర్ వెంటే తెలంగాణ రైతన్నలు ఉంటారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేటలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ అందుతందున్నారు. అలాగే సకాలంలో పంట పెట్టుబడి సాయం, రైతు బీమా, విత్తనాలు, ఎరువుల అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు.

వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ చాలు అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడటం అతని అవివేకానికి నిదర్శనం అన్నారు. ప్రజలను తప్పిదారి పట్టించేందుకే ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ అర్థరహిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.వ్యక్తిగత విమర్శలు తగవని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వారి కండ్లకు కనిపిస్తలేవా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన అవార్డులే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నా రు. ముందు మీ ఇల్లు చక్కదిద్దు కోండి..మీ రాష్ట్రంలో పరిస్థితులు బాగాలేవు. ఒళ్లు దగ్గర పెట్టుకొని ప్రవర్తించాలని ఘాటుగా విమర్శించారు.

బాధ్యతలు స్వీకరించిన సుప్రీంకోర్టు కొత్త న్యాయమూర్తులు

న్యూఢిల్లీ, జులై 14: సుప్రీంకోర్టుకు కొత్తగా నియమితులైన ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి నేడు ప్రమాణ స్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఢిల్లీలోని సుప్రీంకోర్టు ఆడిటోరియంలో వారితో ప్రమాణస్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు సంఖ్యాబలం మొత్తం 34 కాగా, కొత్తగా ఇద్దరు న్యాయమూర్తుల రాకతో జడ్జీల సంఖ్య 32కు చేరింది. మరో రెండు ఖాళీలు ఉన్నాయి.

ఇది ఇలా ఉంటే తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ భుయాన్, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన వెంకటనారాయణకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం సిఫారసు చేసింది. వీరి పదోన్నతికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో వారిద్దరూ నేడు బాధ్యతలు స్వీకరించారు

తెలుగువారైన జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి 1962 మే 6న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా పని చేసిన ఆయన 2019లో కేరళ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ ఏడాది జూన్ 1 కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 1964 ఆగస్టు 2న జన్మించిన జస్టిస్ ఉజ్జల్ భుయాన్ గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. గతేడాది జూన్ 29న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. గతంలో ముంబై హైకోర్టు జడ్జిగా ఆయన సేవలందించారు.

సీఎం కేసీఆర్ మనసున్న మారాజు : మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, జులై 14: సీఎం కేసీఆర్ మనసున్న మారాజు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారు. వారి గురించి అలోచించి అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఃఖీూ ప్రభుత్వానికి దక్కుతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక శాఖల నేతృత్వంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ అధ్వర్యంలో దివ్యాంగుల శిక్షణను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వ పరంగా సమకూరుస్తున్నారు. ట్రై వెహికల్స్, ఇతర పరికరాలు ఉచితంగా అందచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పెన్షన్ ను 4000 రూపాయలకు పెంచారు. దేశంలోనే అత్యధికంగా ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణను టూరిజం స్పాట్ గా మంత్రి కేటీఆర్ తీర్చిదిద్దుతూహైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరం గా అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

మన రాష్ట్ర అతిథ్యం కోసం ఇతర దేశాలు వాళ్లు పోటీ పడే పరిస్థితికి వచ్చింది. మనకున్న విశేషాలు, అనుకూలతలు చూసి మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి పెద్ద పెద్ద కంపెనీలు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. వారందరికీ మనమంతా మంచి ఆతిథ్యం ఇవ్వాలన్నారు. ఈ శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరూ ఈ రంగంలో నిష్ణాతులు కావాలని ఆకాంక్షించారు.

ప్రధాని మోదీకి అరుదైన గౌరవం.. ఫ్రాన్స్ అత్యున్నత అవార్డుతో సత్కారం..

పారిస్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ప్రధాని నరేంద్ర మోదీకి మరో అరుదైన గౌరవం దక్కింది.ఫ్రాన్స్ లో పర్యటిస్తున్న ప్రధాని మోదీకి ఆ దేశ అత్యుతన్నత గౌరవ పురస్కారం లభించింది. ప్రధాని మోదీకి దేశాధ్యక్షుడు మాక్రాన్ 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ హానర్'ను అందించారు. ఎలిసీ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన విందులో ఈ పురస్కారాన్ని అందజేశారు.ఫ్రాన్స్ మిలిటరీ, పౌర పురస్కారాల్లో ఇదే అత్యుత్తమైనది. ఇక ఓ దేశ ప్రధానికి ఈ గౌరవం దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం.దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా, కింగ్ చార్లెస్, ఫ్రాన్స్ మాజీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, ఐక్య రాజ్య సమితి మాజీ కార్యదర్శి బుట్రోస్ ఘాలీలు గతంలో ఈ పురస్కారం అందుకున్నారు.'ప్రధాని మోదీ కి ఫ్రాన్స్ దేశ అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ హానర్ ను ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అందించారు. కోట్లాది మంది భారతీయుల తరఫున మేక్రాన్ కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు' అంటూ భారత విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది.

15న అనాథ బాలల అవస్థలపై కవి సమ్మేళనం

హైదరాబాద్, జులై 14: ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ సాహితీ కిరణం కొసరాజు అర్తి సౌజన్యంతో, జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15న హైదరాబాద్ కొత్తపేట మోహన్‌నగర్‌లోని ట్రస్టు కార్యాలయంలో అనాథ బాలల అవస్థలపై ప్రముఖ వర్తమాన కవులు, కవయిత్రులు 20 మందితో కవిసమ్మేళనం: ఇటీవల ఇదే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం పెద్ద యెత్తున నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొసరాజు సామ్రాజ్యం, సాహితీ కిరణం మేనేజర్ పొత్తూరి జయలక్ష్మిలు మీడియాకు తెలియజేశారు. సీనియర్ సంపాదకుడు బైస దేవదాసు సభాధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమాలకు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా, గుదిబండి వెంకటరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త, డా॥ వై. రామకృష్ణారావు, సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు తదితరులు విశిష్ట అతిథులుగా, ప్రముఖ కవి, విమర్శకుడు రమణ వెలమకన్ని కవి సమ్మేళనం నిర్వాహకుడు పాల్గొని కవితల పోటీ విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తారు.

దూసుకెళ్లిన ఎల్‌ఎంవీ3 రాకెట్.. జాబిలి దిశగా చంద్రయాన్-3

శ్రీహరికోట, జులై 14: ఇస్రో మరో రికార్డు సృష్టించింది. చంద్రుడి దిశగా చంద్రయాన్-3 పయనమైంది. శ్రీహరికోట లోని సతీశ్ ధావన్ సెంటర్ నుంచి ఇవాళ ఎల్‌వీఎం3 ఎం4 రాకెట్ నింగిలోకి దూసుకువెళ్లింది. చంద్రయాన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ఆ రాకెట్ మోసుకువెళ్లింది. ఇవాళ మధ్యాహ్నం 2.35 నిమిషాలకు రాకెట్ గాలిలోకి ఎగిరింది. ఆ తర్వాత అన్ని దశల్లోనూ ఆ రాకెట్ బూస్టర్లు సక్రమంగా మండాయి. ల్యాండర్, రోవర్‌తో చంద్రయాన్-3 వెళ్తోంది. ఆగస్టు 23వ తేదీన చంద్రుడిపై ఆ ల్యాండర్ దిగే అవకాశాలు ఉన్నాయి. చంద్రుడి ఉపరితలాన్ని అధ్యయనం చేసేందుకు పేలోడ్‌లో ప్రత్యేక పరికరాన్ని పంపుతున్నారు.

ఇస్రో ప్రయోగాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో జనం వచ్చారు. సతీశ్ ధావన్ సెంటర్ వద్ద ఉన్న గ్యాలరీ నుంచి ఆ ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో శాస్త్రవేత్తలు, మాజీ శాస్త్రవేత్తలు కూడా చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించారు. 613 కోట్లతో చంద్రయాన్-3 ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే.

రాకెట్ నుంచి చంద్రయాన్-3 విజయవంతంగా వేరుపడింది. చంద్రయాన్ విడిపోగానే ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికి ఒకరు విషెష్ చేసుకున్నారు. కక్ష్యలోకి చంద్రయాన్ ప్రవేశించిందని, అది చంద్రుడి దిశగా తన పయనాన్ని మొదలుపెట్టినట్లు ఇస్రో చీఫ్ సోమనాథ్ తెలిపారు. పారామీటర్స్ అన్నీ నార్మల్‌గా సాగుతున్నట్లు ఇస్రో శాస్త్రవేత్త తెలిపారు. మూన్ జర్నీ ఇప్పుడే మొదలైనట్లు మిషన్ డైరెక్టర్ పేర్కొన్నారు.

చంద్రయాన్ కక్ష్యలోకి ప్రవేశించగానే కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్.. ఇస్రో చీఫ్‌కు కంగ్రాట్స్ తెలిపారు. ఇద్దరూ చంద్రయాన్ నమోనాను ప్రదర్శించారు. ఈ ప్రయోగం దేశానికి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఇండియాను ఉన్నతస్థాయిలో నిలిపిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన థ్యాంక్స్ తెలిపారు.

ఎల్‌వీఎంలో ఇది ఏడో వెహికిల్ అని, అన్నీ సక్సెస్‌ఫుల్‌గా నింగిలోకి దూసుకువెళ్లాయని, దీంతో ఎల్‌వీఎంలో వంద శాతం మన పర్ఫెక్ట్‌గా ఉన్నామని ఇస్రో శాస్త్రవేత్త తెలిపారు. ఎల్‌వీఎం3 ఎం4 రాకెట్ విజయవంతంగా చంద్రయాన్3ని కక్ష్యలోకి తీసుకువెళ్లినట్లు ఇస్రో తన ట్విట్టర్‌లో తెలిపింది. కక్ష్యలోకి వెళ్లిన చంద్రయాన్-3 ఇక మూన్ దిశగా తన జర్నీ మొదలుపెట్టినట్లు ఇస్రో పేర్కొన్నది. స్పేస్‌క్రాఫ్ట్ హెల్త్ నార్మల్‌గా ఉన్నట్లు ఇస్రో ట్వీట్ చేసింది.

చంద్రబాబు కరెంట్ బిల్లులు పెంచితే వ్యతిరేకించింది కేసీఆరే.. బషీర్‌బాగ్ కాల్పుల ఘటనపై హరీశ్‌రావు వివరణ

హైదరాబాద్, జులై 14: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు కరెంట్ బిల్లులు పెంచితే తీవ్రంగా వ్యతిరేకించింది కేసీఆర్ మాత్రమే అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గుర్తు చేశారు. బషీర్‌బాగ్ కాల్పులకు కేసీఆరే కారణమని అంటున్నారు. ఇంత కంటే జోక్ ఉంటుందా..? తెలంగాణ ఉద్యమం పుట్టిందే విద్యుత్ అంశంపై అని హరీశ్‌రావు వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.

నాటి సీఎం చంద్రబాబు కరెంట్ బిల్లులు పెంచితే తీవ్రంగా వ్యతిరేకించింది కేసీఆర్ అని హరీశ్‌రావు తెలిపారు. 2000, ఆగస్టు 28న బషీర్‌బాగ్ కాల్పులు జరిగితే అదే రోజు అప్పటికప్పుడు రైతు హృదయంతో కేసీఆర్ స్పందించారు. అధికార పార్టీలో ఉండి, డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతూ.. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరారు. ఈ ఛార్జీలు తెలంగాణ రైతాంగానికి గుదిబండగా మారుతాయని, తెలంగాణ ప్రాంతంలో వ్యవసాయం ఖతమై పోతుందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మీరు విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే తెలంగాణ జెండా ఎత్తి పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. అదే రోజు కేసీఆర్ డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉండి చంద్రబాబుకు లేఖ రాశారు. నాడు చంద్రబాబు రైతులను కాల్చి చంపితే.. కడుపు రగిలి మా రైతులకు అన్యాయం జరుగుతుందని చెప్పి, బిల్లులు తగ్గించాలని లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని లేఖలో పేర్కొన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

ప్రజల కోసం కేసీఆర్ పదవులను వదులుకున్నారు..

ఇప్పుడు మాట్లాడే వారి నోటికి మొక్కాలి అని హరీశ్‌రావు అన్నారు. ఏదంటే ఏది మాట్లాడితే సమాజం సహించదు. సమాజం తెలివైనటువంటిది. విశ్లేషించుకోగల సామర్థ్యం ఉంది. ఉద్యమం పుట్టిందే విద్యుత్‌లో నుంచి అయితే.. కాల్పులకు కేసీఆర్ కారణం అనడం సరికాదు. డిప్యూటీ స్పీకర్, కేంద్ర మంత్రి పదవి, ఎంపీ పదవులను గడ్డిపోచల్లా మాదిరిగా కేసీఆర్ వదిలేశారు. మీరేమో పదవుల కోసం చొక్కాలను మార్చినట్టు పార్టీలను మారుతున్నారు. కానీ కేసీఆర్ ప్రజల కోసం పదవులను వదులుకున్నారు. ఇవాళ కేసీఆర్ ను ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు సహించరు. కరెంట్ వస్తలేదని అంటున్నారు కదా.. డైరెక్ట్ వెళ్లి కరెంట్ తీగలను పట్టుకుంటే తెలుస్తుంది కదా అని హరీశ్‌రావు సూచించారు.

ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 రాత పరీక్షలు

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఈ ఏడాది ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్ష నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలకు కేటాయించిన ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీలు, స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యధావిధిగా మిగతా ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్, కాలేజీలు నడుస్తాయని స్పష్టం చేసింది. ఆగస్టు 29, 30 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో గ్రూప్-2 ఎగ్జామ్ నిర్వహించనున్నారు.

జాబిలిపైకి చంద్రయాన్-3 ప్రయాణం..!

భారత అంతరిక్ష సంస్థ, ఇస్రో రూ: 615 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ (మూన్ లాండర్ అండ్ రోవర్ మిషన్) నిర్ధేషించిన లక్ష్యాన్ని చేరి, చందమామ ఉపరితల ఒడిలో వాలి, చంద్ర మండల దక్షిణ ధ్రువ ఉపరితలం(ల్యూనార్ సర్ఫేస్)పై తిరుగుతూ పలు అన్వేషణలు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు చేస్తూ అంతరిక్ష రంగంలో భారత పతాకాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ప్రతి భారతీయుడు మనస్ఫూర్తిగా కోరుకుంటున్న శుభ సందర్భమిది. 14 జూలై 2023న మధ్యాహ్నం 2:35 నిమిషాలకు శ్రీహరి కోట సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి 'జియోసింక్రొనస్ సాటలైట్ లాంచ్ వెహికిల్ మార్క్-III (ఎల్‌విఎం-III) వ్యోమనౌక ఉవ్వెత్తున అంతరిక్ష యాత్రను బయలుదేరనున్నది. అక్టోబర్ 2008లో చంద్రయాన్-1 ప్రయోగం, 2019 సెప్టెంబర్‌లో ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్ (48 రోజులు) ప్రయోగాలు చివరి క్షణాల్లో లక్ష్యసాధనలో విఫలం కావడం మనందరికీ తెలుసు. గత ప్రయోగ వైఫల్యాలను దృష్టిలో పెట్టుకొని చంద్రయాన్-3 మిషన్ ద్వారా అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. 'లాండర్ మాడ్యూల్(ఎల్ఎం)' సహాయంతో చంద్ర మండలంపై సురక్షితంగా చేరడం, ఎల్ఎంను భూకక్ష్య నుంచి జాబిలి కక్ష్యలోకి చేర్చడానికి ఉపకరించే 'ప్రొపల్షన్ మాడ్యూల్ (పిఎం), 'రోవర్' సహకారంతో చంద్రుడి ఉపరితలంపై చురుకుగా కలియతిరుగుతూ పరిశోధనలకు సహకరించాలనే లక్ష్యాలను పెట్టుకున్నారు.

చంద్రయాన్-3 ప్రత్యేకతలు, ప్రధాన లక్ష్యాలు:

చంద్ర మండల ఉపరితలంపై థర్మల్ కండక్టివిటీ (ఉష్ణ వాహకత), ఉష్ణోగ్రతల నమోదు, ప్లాస్మా డెన్సిటీ, భూకంప అవకాశాలు (సీస్మిసిటీ), చంద్రుడి ఉపరితలంపై పదార్థాలు/మూలకాల సంఘటన రసాయన విశ్లేషణలు లాంటి పలు శాస్త్ర ప్రయోగాలను ఖచ్చితత్వంతో చేయనుంది. చంద్రయాన్-3 మిషన్‌లో ప్రత్యేకంగా ఆల్టిమీటర్, వెలాసిటీమీటర్, ఇనెర్షియల్ మెజర్‌మెంట్, ప్రొపల్షన్ సిస్టమ్, నావిగేషన్/గైడెన్స్ అండ్ కంట్రోల్, హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడర్, లాండింగ్ లెగ్ మెకానిజమ్ లాంటి అత్యాధునిక శాస్త్రసాంకేతిక ఉపకరణాలను ఉపయోగించారు.

చంద్రయాన్-3 మిషన్ ప్రయోగం ఒక ల్యూనార్ డే లేదా 14 ఎర్థ్ డేస్ (దాదాపు 40 రోజులు) పాటు వివిధ ప్రయోగాలు చేయనుంది. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో తొలిసారి చంద్ర మండల దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 అంతరిక్ష నౌక కాలు మోపి పలు ఆసక్తికర ప్రయోగాలను చేయనున్నది. 14 జూలై 2023 ప్రారంభమవుతున్న చంద్రయాన్-3 ప్రయోగం ఆగష్టు 23/24 వరకు చంద్రుడి ఉపరితలంపై చేరుతుందని అంచనా వేస్తున్నారు. ల్యాండర్‌లో అమర్చిన 26 కిజీల రోవర్‌ల సహకారంతో అనేక ప్రధాన పరిశోధనలు చేయనున్నది.

అధిక వేగం, మేలైన శక్తి ఉత్పత్తి సామర్థ్యం, పీడనాన్ని తట్టుకునే శక్తి, డిస్ఓరియంటేషన్/రొటేషన్ సెన్సార్ల వాడకం లాంటివి చంద్రయాన్-3 మిషన్ ప్రత్యేకతలుగా పేర్కొంటున్నారు.

కోట్ల భారతీయుల ఆశలను నింగిలోకి మోసుకుపోతున్న చంద్రయాన్-3 ప్రయోగం దిగ్విజయంగా తన లక్ష్యాలను ఛేదించాలని కోరుకుంటున్నాం. ఇస్రో అధ్యక్షులు సోమనాథ్ ంలో అంతరిక్ష శాస్త్ర సాంకేతిక నిపుణుల అపార కృషి ఫలించి అంతరిక్ష పరిశోధనల చరిత్రలో అమెరికా, రష్యా, చైనాల సరసన భారతం చేరి సుస్థిర స్థానం సంపాదించాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఫ్రాన్స్ మరియు యుఎఇల సందర్శనకు ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 14:నేను నా మిత్రుడు, ఫ్రాన్స్ అధ్యక్షుడైన మాన్య శ్రీ ఇమేన్యుయెల్ మేక్రోన్ ఆహ్వానాన్ని అందుకొని జులై 13 వ మరియు జులై 14 వ తేదీ లలో ఫ్రాన్స్ కు ఆధికార సందర్శన నిమిత్తం బయలుదేరి వెళుతున్నాను.

ఈ యాత్ర విశిష్టమైంది ఎందుకు అంటే నేను అధ్యక్షుడు మాన్య శ్రీ ఇమేన్యుయెల్ మేక్రోన్ తో కలసి ఫ్రెంచ్ జాతీయ దినం.. అదే బాస్టీల్ డే వేడుకల లో గౌరవ అతిథి గా పాలుపంచుకోనున్నాను. బాస్టీల్ డే పరేడ్ లో భారతదేశాని కి చెందిన మూడు సేన ల దళాల జట్టు ఒకటి కూడా పాల్గొననుంది; కాగా భారతీయ వాయుసేన కు చెందిన ఒక విమానం ఈ సందర్భం లో ఫ్లయ్- పాస్ట్ ను ప్రదర్శించనుంది.

ఈ సంవత్సరం మన వ్యూహాత్మ భాగస్వామ్యం తాలూకు 25 వ వార్షికోత్సవం కూడా ను. ప్రగాఢ విశ్వాసం మరియు నిబద్ధత లతో పెనవేసుకొన్న మన ఇరు దేశాల మధ్య రక్షణ, అంతరిక్షం, పౌర ప్రయోజనాల కోసం పరమాణు శక్తి వినియోగం, బ్లూ ఇకానమి, వ్యాపారం, పెట్టుబడి, విద్య, సంస్కృతి మరియు ఉభయ దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలు సహా విభిన్న రంగాల లో సన్నిహిత సహకారం కొనసాగుతున్నది. మనం ప్రాంతీయ అంశాలు మరియు ప్రపంచ అంశాల పై కలసి పని చేస్తున్నాం.

అధ్యక్షుడు మాన్య శ్రీ ఇమేన్యుయెల్ మేక్రోన్ తో సమావేశమవ్వాలని మరియు ఈ చిరకాలిక భాగస్వామ్యాన్ని, కాల పరీక్ష కు తట్టుకొని నిలచినటువంటి భాగస్వామ్యాన్ని రాబోయే 25 సంవత్సరాల పాటు కొనసాగించడం కోసం విస్తృత శ్రేణి చర్చల ను జరపాలని నేను ఉత్సాహపడుతున్నాను.

2022 వ సంవత్సరం లో నేను ఫ్రాన్స్ ను ఆధికారికం గా సందర్శించిన అనంతరం అధ్యక్షుడు మాన్య శ్రీ ఇమేన్యుయెల్ మేక్రోన్ తో భేటీ అయ్యే అవకాశాలు అనేకం దక్కాయి. మరి ఇటీవలే 2023 మే నెల లో జి-7 శిఖర సమ్మేళనం సందర్భం లో జాపాన్ లోని హిరోశిమా లో నేను ఆయన తో భేటీ అయ్యాను.

ఫ్రాన్స్ ప్రధాని ఎలిజాబెథ్ బోర్న్ గారు, సీనెట్ యొక్క అధ్యక్షుడు మాన్య శ్రీ జెరార్డ్ లార్చర్, నేషనల్ అసెంబ్లీ అధ్యక్షురాలు యేల్ బ్రాన్-పివే గారు సహా ఫ్రాన్స్ యొక్క నాయకత్వం తో మాటామంతీ జరపడానికి నేను ఉత్సుకత తో ఉన్నాను.

నా సందర్శన లో భాగం గా, చైతన్యం ఉట్టిపడే భారతదేశ ప్రవాసి సముదాయం, ఉభయ దేశాల కు చెందిన అగ్రగామి ముఖ్య కార్యనిర్వహణ అధికారులు (సిఇఒ స్) మరియు ఫ్రాన్స్ కు చెందిన ప్రసిద్ధ వ్యక్తుల తో భేటీ అయ్యే అవకాశం కు ప్రాప్తించనుంది. ఈ యాత్ర తో మన వ్యూహాత్మక భాగస్వామ్యాని కి ఒక క్రొత్త జోరు లభిస్తుందన్న విశ్వాసం నాలో ఉంది.

పేరిస్ నుండి నేను జులై 15 వ తేదీ నాడు ఒక ఆధికారిక సందర్శన నిమిత్తం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఇఎ) లోని అబూ ధాబీ కి వెళ్తాను. యుఎఇ అధ్యక్షుడు మరియు అబూ ధాబీ పాలకుడు, నా మిత్రుడు మాన్య శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ అల్ నాహ్ యాన్ తో సమావేశం కావడం కోసం నేను ఎదురుచూస్తున్నాను.

మన రెండు దేశాలు వ్యాపారం, పెట్టుబడులు, శక్తి, ఆహార సురక్ష, విజ్ఞాన శాస్త్రం ఉ సాంకేతిక విజ్ఞానం, విద్య, ఫిన్ టెక్ , రక్షణ, భ్రదత లతో పాటు ఉభయ పక్షాల ప్రజల మధ్య పటిష్ఠమైనటువంటి పరస్పర సంబంధాలు వంటి అనేక రంగాల లో సహకరించుకొంటున్నాయి. కిందటి సంవత్సరం లో అధ్యక్షుడు మాన్య శ్రీ శేఖ్ మొహమ్మద్ బిన్ జాయద్ మరియు నేను మన భాగస్వామ్యం యొక్క భవిష్యత్తు సంబంధి మార్గసూచి విషయం లో సమ్మతి ని వ్యక్తం చేశాం. మరి మన సంబంధాల ను మరింత గా విస్తృతం చేసుకోవడం ఎలా అనే విషయమై ఆయన తో చర్చించడాని కి నేను నిరీక్షిస్తున్నాను.

యుఎఇ ఈ సంవత్సరం చివరికల్లా కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ ఆఫ్ ది యుఎన్ఎఫ్ సిసిసి (సిఒపి-28) కి ఆతిథేయి గా వ్యవహరించనుంది. జలవాయు సంబంధి కార్యాచరణ ను వేగవంతం చేసే దిశ లో ప్రపంచ సహకారాన్ని బలోపేతం చేయడం అనే అంశం లో నా ఆలోచనల ను వెల్లడించబోతున్నాను. తద్వారా పేరిస్ ఒప్పందం యొక్క అమలు లో భాగం గా శక్తి అంశం లో మార్పు మరియు కార్యరూపం లోకి తీసుకువచ్చే ప్రక్రియ కు రంగం సిద్ధం కాగలదు.

నా యుఎఇ సందర్శన తో మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం లో ఒక సరిక్రొత్త అధ్యాయం ఆరంభం అవుతుందని నేను నమ్ముతున్నాను.

జనసేన నేతకు సీఐకి మానవ హక్కుల కమిషన్ నోటీస్ జారీ

తిరుపతి, జులై 14:తిరుపతి జిల్లా శ్రీ కాళహస్తికి చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంజు యాదవ్ పై మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. జనసేన పార్టీకి చెందిన నేతపై తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చేతితో కొట్టిన ఘటన గత బుధవారం చోటుచేసుకున్న సంగతి విధితమే. జనసేన ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపిన వారు దుమారం సృష్టించారు. వాలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వైసీపీ నేతలు, వాలంటీర్లు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇందుకు ప్రతిగా శ్రీకాళహస్తి లో బుధవారం జనసేన ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక కళ్యాణ మండపం సమీపంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టె సాయి మహేష్‌తో పాటు ఇతర నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధమయ్యారు.

పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని నాయకులందరినీ బలవంతంగా టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో టౌన్ సీఐ అంజుయాదవ్ జనసేన నాయకుడు సాయిపై అసభ్యంగా ప్రవర్తించారు. ఆమె రెండు చెంపల మీద కొట్టింది. ఈ ఆకస్మిక పరిణామంతో బిత్తరపోయిన జనసేన నాయకులు సిఐ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించిన ఘటనలో పలువురు జనసేన నాయకులపై టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనను వివిధ దినపత్రికలో ప్రచురించబడిన ఫోటోలను మానవ హక్కుల సంఘం పరిశీలించి సుమోటో కేసుగా నమోచేసింది. ఇందుకు సంబంధించి ప్రతివాదులైన ఐదు మందికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 27 వ తేదీలోగా అందుకు సమాధానం ఇవ్వాలని అందులో ఆదేశించారు.

తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు-నీలం మధు

మెదక్, జులై 14:(నేటినిజం ప్రతినిధి):ఉమ్మడి మెదక్ బ్యూరో : తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల ఉత్సవాలు నిలుస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కోలు సర్పంచ్ నీలం మధు అన్నారు.. పటాన్చెరు పట్టణం బండ్లగూడ గ్రామంలో నిర్వహించిన బోనాల మహోత్సవానికి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మధును ఘనంగా సత్కరించారు.

తెలంగాణ బోనాలు అంటే దేశవిదేశాల్లో కూడా గౌరవిస్తారని మధు స్పష్టం చేశారు.

సిఎం కేసీఆర్ తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలను ప్రపంచ వేదికల మీద గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్ లో కూడా ప్రజలు బీఆర్ఎస్ ను నిండు మనస్సుతో దీవిస్తే తిరిగి వస్తుందన్నారు. పలితంగా దేశం గర్వించేలా సంక్షేమం - అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో జంగయ్య, సత్యా, శ్రీశైలం, భాస్కర్, శ్రీను, బాల్ రాజ్, శ్రీను, కిషోర్, మధు, కృష్ణ, సాయి, జాతర నిర్వాహకులు, ఔటీఖీ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భారత నౌకాదళ సామర్థ్యం పెంచడానికి ఫ్రాన్స్ నుంచి 26 రాఫెల్ మెరైన్ విమానాల కొనుగోలు ప్రతిపాదనకు డీఏసీ ఆమోదం

న్యూఢిల్లీ, జులై 14:భారత రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఇవాళ జరిగిన 'రక్షణ రంగ కొనుగోళ్ల మండలి' (డీఏసీ) సమావేశంలో మూడు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. 26 రాఫెల్ మెరైన్ విమానాల కొనుగోలుకు 'యాక్సెప్టెన్స్ ఆఫ్ నెసిసిటీ'ని (ఏవోఎన్) డీఏసీ మంజూరు చేసింది. విమాన అనుబంధ పరికరాలు, ఆయుధాలు, సిమ్యులేటర్, విడిభాగాలు, పత్రాలు, సిబ్బంది శిక్షణ, లాజిస్టిక్ మద్దతు కూడా విమానాల కొనుగోలుతో కలిపి అనుమతి మంజూరు చేసింది. ఇలాంటి విమానాలను ఇతర దేశాలు కొన్న ధర నహా సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, భారత్‌కు సరఫరా చేసే ధర, ఇతర కొనుగోలు నిబంధనలపై ఫ్రాన్స్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతారు. భారతదేశం రూపొందించిన పరికరాలను రాఫెల్ మెరైన్ విమానాల్లో ఏర్పాటు చేయడం, వివిధ వ్యవస్థల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల (ఎంఆర్‌వో) కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటివి కూడా చర్చల ద్వారా ఒప్పంద పత్రాల్లో చేరుస్తారు.

మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించే మూడు స్కార్పెన్ జలాంతర్గాముల సేకరణకు కూడా 'బయ్' (ఇండియన్) విభాగం కింద డీఏసీ అనుమతి మంజూరు చేసింది. ఎక్కువ శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన జలాంతర్గాములను సేకరించడం వల్ల భారత నౌకాదళ శక్తి, సామర్థ్యాలు పెరగడం మాత్రమే కాకుండా, దేశీయ రంగంలో ఎక్కువ ఉపాధి అవకాశాలను కూడా సృష్టించవచ్చు. జలాంతర్గాముల నిర్మాణంలో మరింత సామర్థ్యం, నైపుణ్యం పెంచుకోవడానికి ఎండీఎల్‌కు కూడా ఇది ఉపయోగపడుతుంది.

అన్ని విభాగాల్లో అవసరమైన స్వదేశీ పరిజ్ఞానాన్ని సాధించడానికి కావలసిన మూలధన సేకరణలకు మార్గదర్శకాలు రూపొందించే ప్రతిపాదనను కూడా డీఏసీ ఆమోదించింది. కీలక తయారీ సాంకేతికతల్లో 'స్వయంసమృద్ధి'ని సాధించడంలో ఇది సహాయపడుతుంది.

రైతుల త్యాగం వల్లే నృసింహ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం : ఎమ్మెల్యే హైళ్ల శేఖర్ రెడ్డి

భువనగిరి, జులై 14: ప్రభుత్వానికి రైతులు అందిస్తున్న సహకారం వల్లే నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు విజయవంతంగా పూర్తవుతున్నాయని భువనగిరి శాసనసభ్యులు హైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. రైతులు తమ భూములను ప్రభుత్వానికి అందజేసి త్యాగం చేయడం వల్లే నృసింహ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

నృసింహ సాగర్(బస్వాపూర్ రిజర్వాయర్) ముంపు గ్రామం బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్థులకు పునరావాసం కింద 1053 మందికి శుక్రవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో హుస్నాబాద్ వద్ద కేటాయించిన ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది రైతులు తమ భూములను రిజర్వాయర్ కోసం త్యాగం చేయడం అభినందనీయమని అన్నారు.వారికి ఆయకట్టు పరిధిలోని రైతులు, ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వారి త్యాగం వల్లే రిజర్వాయర్ నిర్మాణం సాధ్యమవుతుందని వెల్లడించారు. మొత్తం 93 ఎకరాల భూమి లో మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్ల స్థలాలకు కేటాయించామని వివరించారు. ఈ సందర్భంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాలను కేటాయించినందుకు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయం నిర్మాణానికి లలిత జ్యువెలర్స్ రూ.21లక్షల విరాళం

రంగారెడ్డి, జులై 14:లలిత జ్యువెలర్స్ అధినేత డాక్టర్ కిరణ్ కుమార్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని నందిగామ మండలంలో నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నూతన నిర్మాణాన్ని పరిశీలించారు. శుక్రవారం ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ తో పాటు ఆయన దేవాలయానికి విచ్చేసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక గురుస్వామి శ్రీశ్రీశ్రీ సతీష్ నాయర్ తదితర భక్త బృందం డాక్టర్ కిరణ్ కుమార్, నిర్మాత బండ్ల గణేష్ లకు స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. ఇదివరకే 15 లక్షల రూపాయల విరాళం ప్రకటించిన లలిత జ్యువెలర్స్ అధినేత డాక్టర్ కిరణ్ కుమార్ మరో 6 లక్షల రూపాయలను అదనంగా ప్రకటించారు.

గురుస్వామి శ్రీశ్రీశ్రీ సతీష్ నాయర్ చెప్పిన మాటలకు ఎంతో తన్మయత్వం చెందిన కిరణ్ కుమార్ వెంటనే స్పందించి 15 లక్షలు కాదు 21 లక్షల విరాళం ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. దీనికి స్పందించిన గురుస్వామి సతీష్ నాయర్ ఈ గుడి ముఖ ద్వారంపై సువర్ణ అక్షరాలతో లలిత జ్యువెలర్స్ అధినేత డాక్టర్ కిరణ్ కుమార్ పేరును లిఖిస్తానని ఆయన అన్నారు. ఇంత పెద్ద సాయం చేయడం ఎంతో గొప్ప విషయమని ఆయనను అభినందించి సన్మానించారు. అనంతరం నిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ.. లలిత జ్యువెలర్స్ అధినేత డాక్టర్ కిరణ్ కుమార్ ఆలయ నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించి, ఎంతో తన్మయత్వంతో 21 లక్ష రూపాయలను ప్రకటించడం అద్భుతంగా ఉందని, ఇది అయ్యప్ప మహత్యం అని ఆయన అభిప్రాయపడ్డారు.

తన ప్రాంతానికి ఎంతో పెద్ద మనసుతో విచ్చేసి ఆధ్యాత్మిక భావనతో లక్షలాది రూపాయలు ఇస్తున్న భక్తులకు అదే విధంగా ప్రత్యేకంగా డాక్టర్ కిరణ్ కుమార్ కు ప్రత్యేక అభివందనాలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్మాత బండ్ల గణేష్ పిలుపునిచ్చారు. ఇదివరకే నిర్మాత బండ్ల గణేష్ ఆలయ నిర్మాణం కోసం సుమారు రెండున్నర కోట్ల రూపాయలను విరాళాల సేకరణ చేస్తానని హామీ ఇచ్చిన సంగతి విధితమే. అంతకుముందు డాక్టర్ కిరణ్ కుమార్ గురు స్వామి సతీష్ నాయర్ పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఆయన పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.

రేవంత్‌రెడ్డివి మతిస్థిమితం లేని మాటలు : ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి

భూపాలపల్లి, జులై 14: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని పిచ్చి మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి కి రైతులు నిరసనలు తెలిపినా బుద్ధి రావడం లేదు విమర్శించారు.

2004 నుంచి 2009 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 9 గంటల కరెంటు ఇస్తానని వాగ్దానం చేసిందన్నారు. ఇదే విషయం నాడు అసెంబ్లీలో ప్రశ్నించడానికి తాను సిద్ధపడగా అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి 9 గంటల ఉచిత విద్యుత్తు ఇవ్వడం సాధ్యం కాదని అన్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో గొప్ప సంస్కరణలు తీసుకువచ్చి రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత కరెంటు అందిస్తుందని వెల్లడించారు.సభ్యతా, సంస్కారం లేకుండా మాటలు మాట్లాడితే రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజలు తరిమికొట్టడం ఖాయమని అన్నారు. చంద్రబాబు చేతిలో రేవంత్ రెడ్డి రిమోట్ కంట్రోల్ అని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ,రైతు బీమా ,24 గంటలు ఉచిత కరెంటు ఇలా అనేక సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతో రైతుల వద్దకు ఏం ముఖం పెట్టుకొని పోవాలో అర్థం కాక రేవంత్ మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు.

గత ఎన్నికల సమయంలో ఒకేసారి 105 మంది అభ్యర్థులను ప్రకటించిన ఘనత సీఎం కేసీఆర్‌దని , అధ్యక్షుడిగా ఒక టికెట్ అయినా ప్రకటించగలవా ప్రశ్నించారు. బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాజధాని లేని ఏపీని ముందుకు పట్టించుకోవాలని, తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు.

ఏలూరు జిల్లాలో ఘోరం..

-భార్య మొదటి భర్త ఇద్దరు కూతుళ్లపై రెండో భర్త ఏళ్ల తరబడి లైంగిక దాడి

ఏలూరు జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : పెదపాడు మండలం వట్లూరులో ఘోరం చోటు చేసుకుంది. భార్య మొదటి భర్త ఇద్దరు కూతుళ్లపై రెండో భర్త ఏళ్ల తరబడి లైంగిక దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. టెన్త్ క్లాస్ చదువుతున్న భార్య మొదటి కుమార్తెపై రెండవ భర్త అయిన పుట్టా సతీష్ కుమార్ (43) లైంగిక దాడి చేశాడు. ఆ అమ్మాయి ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఆ తరువాత మళ్లీ గర్భం దాల్చింది. అంతటితో ఆగక రెండో కుమార్తెపై కూడా వరుసగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. రెండో కుమార్తె గర్భం దాల్చి ఆపై చనిపోయిన బిడ్డకు జన్మనిచ్చింది. ఇంతటి దారుణానికి భార్య సహకారంతోనే భర్త పాల్పడటం షాకింగ్‌గా మారింది.మొదటి భర్త చనిపోవడంతో సతీష్‌ను సదరు మహిళ రెండో పెళ్లి చేసుకుంది. తనకు పిల్లలు కావాలని పెళ్లి చేసుకున్న మహిళను సతీష్ కుమార్ అడిగాడు. తనకు పిల్లలు పుట్టే అవకాశం లేకపోవడంతో.. తన మొదటి భర్తకు పుట్టిన ఇద్దరు కూతుళ్లను సతీష్ వద్దకు మహిళ బలవంతంగా పంపించింది. మహిళకు, రెండో భర్త సతీష్‌కు మధ్య విభేదాలు రావడంతో ఈ ఘోరం వెలుగు చూసింది. ఏలూరు దిశ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదు అయ్యింది. భార్యాభర్తలిద్దరినీ అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. నిందితులపై పోక్సో, లైంగిక దాడుల కేసు నమోదు అయ్యింది.

రూ.2,900 కోట్ల విలువైన 3 ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు తిరుపతిలో శంకుస్థాపన చేసిన శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జులై 14::కేంద్ర రహదారి రవాణా ఉ జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ, 3 జాతీయ రహదారి ప్రాజెక్టులకు తిరుపతిలో ఇవాళ శంకుస్థాపన చేశారు.

ఈ ప్రాజెక్టుల మొత్తం పొడవు 87 కిలోమీటర్లు, వ్యయం రూ.2,900 కోట్లు.

ఎన్‌హెచ్-71లోని నాయుడుపేట-తూర్పు కణుపూర్ సెక్షన్‌లో, ?1,399 కోట్ల పెట్టుబడి వ్యయంతో చేపట్టే 35 కి.మీ. పొడవైన రహదారి ప్రాజెక్టుకు మొదట శంకుస్థాపన చేశారు. ఎన్‌హెచ్ 516డబ్ల్యూలోని చిల్లకూరు క్రాస్-కృష్ణపట్నం పోర్టు సౌత్ గేట్ సెక్షన్‌లో, ?909 కోట్ల వ్యయంతో నిర్మించే 36 కి.మీ. ప్రాజెక్టు రెండోది. ఎన్‌హెచ్-516డబ్ల్యూ, ఎన్‌హెచ్-67లోకి వచ్చే తమ్మినపట్నం-నారికెళ్లపల్లె సెక్షన్‌లో, ?610 కోట్ల వ్యయంతో ఏపూరు నుంచి కృష్ణపట్నం ఓడరేవు వరకు 16 కి.మీ. పొడవైన నౌకాశ్రయ రహదారి నిర్మాణం మూడో ప్రాజెక్టు.

కృష్ణపట్నం నౌకాశ్రయానికి ఎలాంటి అవాంతరాలు లేని, సురక్షితమైన రవాణా సదుపాయం ఈ ప్రాజెక్టుల లక్ష్యంగా శ్రీ గడ్కరీ చెప్పారు. జాతీయ బృహత్తర పథకం ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలు, నెల్లూరులోని సెజ్‌లకు వేగంగా చేరడానికి ఈ ప్రాజెక్టుల వల్ల అవకాశం లభిస్తుందని చెప్పారు. తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకు ప్రయాణించే భక్తుల భద్రత, సౌకర్యం పెరుగుతుందన్నారు. గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, దేశవ్యాప్తంగా వేగవంతమైన, అవాంతరాలు లేని, ఇంధన సమర్థవంతమైన రవాణా సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టులు శ్రీహరికోటలోని నేలపట్టు పక్షుల అభయారణ్యం, షార్ వంటి పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటకాన్ని బలోపేతం చేస్తాయని శ్రీ గడ్కరీ చెప్పారు. తద్వారా, ఉపాధి అవకాశాలను కూడా భారీగా పెరుగుతాయని కేంద్ర మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

తాతకు, తండ్రికి బుద్ధి చెప్పావు

-కేటీఆర్ పరేషాన్‌లో ఉన్నారు

-కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్గొండ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: కరెంట్ 11 గంటల కన్నా ఎక్కువ రావడం లేదని తాను చెప్పడంతోనే నల్గొండ జిల్లాలోని 350 సబ్ స్టేషన్లలో లాగ్ బుక్స్ గుంజుకెళ్లారని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

ఈ సందర్భంగా శుక్రవారం ఆయన నల్గొండలో మీడియా తో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియక పరేషాన్‌లో ఉన్నారని, 24 గంటల కరెంటు ఇవ్వడం కేటీఆర్‌కు చేత కాదని.. కనీసం ప్రభుత్వ విద్యాసంస్థల్లోనైనా బాత్రూమ్స్ బాగు చేయించాలని సూచించారు.ఈ సందర్భంగా హిమాన్స్ శభాష్.. అంటూ.. తాతకు, తండ్రికి బుద్ధి చెప్పావని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కన్నీళ్లు పెట్టుకున్న హిమాన్స్‌ను చూసైనా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మూడు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని.. మేము చేసేదే చెబుతామని అన్నారు.

ఈ నెల 20న ప్రియాంక గాంధీ సభలో మహిళల కోసం డిక్లరేషన్ చేయబోతున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే వికలాంగులకు రూ.5 వేల పెన్షన్ ఇస్తామని కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

సాయుధ బలగాల ఆహార అలవాట్లు మార్చి చిరుధాన్యాల వినియోగం ఎక్కువ చేసి, సురక్షితమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడానికి రక్షణ

న్యూఢిల్లీ, జులై 14:సాయుధ బలగాల ఆహార అలవాట్లు మార్చి చిరుధాన్యాల వినియోగం ఎక్కువ చేసి, సురక్షితమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడానికి రక్షణ మంత్రిత్వ శాఖతో ఎఫ్ఎస్ఎస్ఏఐ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అవగాహన ఒప్పందంపై రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ సమక్షంలో 2023 జూలై 13న సంతకాలు జరిగాయి.

ఈ సందర్భంగా ' రక్షణ కోసం ఆరోగ్యకర వంటకాలు' పుస్తకాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్,డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. శ్రీ అన్న (చిరుధాన్యాలు) వాడకాన్ని ఎక్కువ చేసి, వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను పుస్తకంలో పొందుపరిచారు.

అవగాహన ఒప్పందంపై రక్షణ శాఖ తరఫున డైరెక్టర్ జనరల్ (సరఫరాలు, రవాణా) లెఫ్టినెంట్ జనరల్ ప్రీత్ మొహిందర సింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈఓ శ్రీ జి కమల వర్ధనరావు సంతకాలు చేశారు. ఆహార వైవిధ్యం,చిరుధాన్యాలు ఉపయోగించి సిద్ధం చేసే ఆహార ఉత్పత్తుల పోషక ప్రయోజనాల గురించి సిబ్బందిలో అవగాహన కల్పించడం కోసం ఒప్పందం ద్వారా కృషి చేస్తారు. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన మెస్, క్యాంటీన్లు, ఇతరఆహార సరఫరా కేంద్రాలలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రవేశపెట్టడానికి కూడా అవగాహన ఒప్పందం అవకాశం కల్పిస్తుంది.

ఆహార భద్రత,ప్రమాణాల చట్టం 2006 కింద పొందుపరిచిన నిబంధనలకు అనుగుణంగా సాయుధ బలగాలకు ఆహారం తయారు చేస్తున్న చెఫ్, సరఫరాదారులు ఆహార భద్రత, పరిశుభ్రత అంశాలపై కూడా ఒప్పందంలో భాగంగా శిక్షణ అందిస్తారు. సాయుధ బలగాల సిబ్బంది ఆరోగ్య సంరక్షణ అంశానికి రక్షణ మంత్రిత్వ శాఖ ఇస్తున్న ప్రాధాన్యతను ఒప్పందం తెలియజేస్తుంది. దేశ సేవలో ఉన్న సాయుధ బలగాల సిబ్బంది ఆరోగ్యం, దృఢత్వానికి ఈ చర్యలు సహకరిస్తాయి. ప్రజలు ముఖ్యంగా సాయుధ బలగాల కుటుంబాలు పౌష్టికాహారాన్ని తీసుకోవడానికి , ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఎంపిక చేసుకుని ఆహార భద్రత పొందేలా ఒప్పందం ద్వారా కృషి జరుగుతుంది.

రక్షణ కోసం ఆరోగ్యకర వంటకాలు' పుస్తకాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ రూపొందించింది. దీనిలో చిరుధాన్యాలు ఉపయోగించి తయారు చేసిన ఆహార పదార్థాల వివరాలు పొందుపరిచారు. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న క్యాంటీన్లు, ఫుడ్ అవుట్‌లెట్‌లకు పుస్తకం విలువైన సమాచారం అందిస్తుంది. విభిన్న వాతావరణ పరిస్థితులు, క్లిష్టమైన భూభాగాల్లో రక్షణ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి వారు బలమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు విభిన్నమైన సమతుల్య ఆహారాన్ని అందిస్తాయి.

ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, డిఫెన్స్ సెక్రటరీ శ్రీ గిరిధర్ అరమానె, ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, రక్షణ శాఖ, ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయిలో భారతదేశం మరింత ఎదగడానికి చంద్రయాన్ ప్రయోగం సహకరిస్తుంది- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 14:కోవిడ్ వ్యాక్సిన్ తయారీతో భారతదేశం సాధించిన విజయాలను చంద్రయాన్ మరింత ముందుకు తీసుకు వెళ్తుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), పీఎంఓలో సహాయ మంత్రి, అంతరిక్షం,అణుశక్తి సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, భూ శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. చంద్రయాన్ -3 ప్రపంచ స్థాయిలో భారతదేశం స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. స్వదేశీ సామర్థ్యాలను వినియోగించి కోవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధి చేసి విజయం సాధించిన భారతదేశం చంద్రయాన్-3 తో మరోసారి తన సామర్థ్యాలను నిరూపిస్తుందన్నారు.

హైదరాబాద్ లో ఈ రోజు జరిగిన 11వ ఇండియా అలయన్స్ వార్షిక సదస్సు 2023 లో డాక్టర్ జితేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ జితేంద్ర సింగ్ రేపు చంద్రయాన్-3 ప్రయోగం జరుగుతుందని తెలిపారు. ప్రయోగానికి ఒక రోజు ముందు జరుగుతున్న ఇండో-యుకె సైన్స్ కాన్క్లేవ్ శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశం సాధించిన ప్రగతికి నిదర్శనం అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం తో కలిసి పనిచేయడానికి అభివృద్ధి చెందిన దేశాలు ముందుకు వస్తున్నాయి అని చెప్పడానికి సదస్సు ఒక నిదర్శనం అని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

బయో మెడికల్ పరిశోధన రంగంలో భారత దేశంలో బలమైన, ప్రపంచ-స్థాయి మానవ వనరులను అభివృద్ధి చేయడానికి కేంద్ర బయోటెక్నాలజీ మంత్రిత్వ శాఖ, యూకేకు చెందిన వెల్‌కమ్ ట్రస్ట్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఇండియా అలయన్స్ ఏర్పాటయింది.

గత 15 సంవత్సరాల కాలంలో భారతదేశ పరిశోధన రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు నిధులు సమకూర్చే అంశంలో ఇండియా అలయన్స్ కీలక పోషించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. దేశంలో బయోమెడికల్, క్లినికల్ రీసెర్చ్ వ్యవస్థల్లో ఇండియా అలయన్స్ ప్రభావవంతమైన మార్పు తీసుకు వచ్చిందన్నారు. 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2019లో ఇండియా అలయన్స్ టీమ్ సైన్స్ గ్రాంట్స్, క్లినికల్/పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ సెంటర్‌లను ప్రారంభించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వివిధ విభాగాలతో కలిసి పరిశోధనలు ప్రారంభించిందని ఆయన తెలియజేశారు.

భారత ప్రభుత్వం, వెల్‌కమ్ ట్రస్ట్ మధ్య కుదిరిన అవగాహనతో ఏర్పాటైన ఇండియా అలయన్స్ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది అని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు నిధుల నిధుల సమీకరణకు ప్రాధాన్యత ఇచ్చిన ఇండియా అలయన్స్ వివిధ పథకాల ద్వారా నిధులు సమకూర్చి భారతదేశంలో పరిశోధన ప్రతిభను అభివృద్ధి చేసిందన్నారు. భారతీయ పరిశోధకులు వృత్తిలో రాణించి అభివృద్ధి సాధించడానికి అవసరమైన సానుకూల ప్రభావాన్ని ఇండియా అలయన్స్ అందించిందని ఆయన అన్నారు. సామర్థ్యం పెంపుదల, సాంకేతిక రంగాలపై ఇండియా అలయన్స్ ప్రభావం చూపిందన్నారు.

భారతదేశ పరిశోధన సంస్థల్లో పరిశోధన నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఇండియా అలయన్స్ పెట్టుబడి పెట్టిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. భారతదేశ పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే అంశంలో నిర్వహణ సామర్థ్యం కీలకంగా ఉంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ఇండియా అలయన్స్ కార్యక్రమాలతో 589 కి మించి ఎక్కువ మంది పరిశోధనా శాస్త్రవేత్తలు ప్రయోజనం పొందారు. భారతదేశంలోని 48 నగరాల్లోని 137 విభిన్న సంస్థలకు ఇండియా అలయన్స్ నిధులు సమకూర్చింది. జాతీయ అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే అంశంపై ఇండియా అలయన్స్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు.

ఇండియా అలయన్స్ అమలు చేస్తున్న కార్యక్రమాల వల్ల అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి భారతదేశానికి సహకారం అందిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. విదేశాల నుంచి అందిన సహకారంతో శాస్త్ర, పరిశోధన రంగాలు అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి సాధించాయన్నారు.

యూరోపియన్ మాలిక్యులర్ బయాలజీ సంస్థతో కలిసి పనిచేస్తున్న ఇండియా అలయన్స్ ఇంతవరకు ప్రాధాన్యత లభించని రంగాల్లో పరిశోధనలు ప్రోత్సహించడానికి వివిధ సంస్థలతో కలిసి శాస్త్రీయ సైంటిఫిక్ సమావేశాలు నిర్వహించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. యూకే చెందిన క్యాన్సర్ రీసెర్చ్, ఆఫ్రికన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, స్విస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ లాంటి అంతర్జాతీయ సంస్థల సహకారంతో ఇండియా అలయన్స్ పరిశోధన కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

దేశంలో పరిశోధనలు చేపట్టేందుకు టీమ్ సైన్స్ గ్రాంట్స్, క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ సెంటర్ గ్రాంట్స్ ఆధ్వర్యంలో ఇండియా అలయన్స్ అంతర్జాతీయ స్థాయిలో, వివిధ సంస్థల మధ్య సమన్వయం సాధించి పరిశోధన కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఇటీవల వచ్చిన మహమ్మారి పరిశోధనలు చేపట్టగల సామర్థ్యం వైద్యులకు ఉండాలని గుర్తు చేసిందన్నారు. ప్రాథమిక, క్లినికల్,ప్రజారోగ్య పరిశోధనల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఇండియా అలయన్స్ చేసిన కృషిని శిక్షణ పొందిన వైద్యుడిగా తాను గుర్తించానని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఎక్కువ మంది వైద్యులు పరిశోధనలు చేపట్టి సహకరించారని ఆయన అన్నారు.

కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఇండియా అలయన్స్ అనుబంధ సంస్థలు తమ సంస్థల్లో కోవిడ్ పరీక్షలు, చికిత్స కార్యక్రమాలు నిర్వహించాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. శిప్రజారోగ్య రంగంలో పరిశోధనలు ప్రోత్సహించడానికి ఇండియా అలయన్స్ క్లినికల్, పబ్లిక్ హెల్త్ ఫెలో షిప్పులు అందిస్తుందన్నారు. ఇటీవల క్లినికల్, ప్రజారోగ్య పరిశోధన సంస్థలకు ఇండియా అలయన్స్ గ్రాంటులు అందించడం ప్రారంభించిందని మంత్రి తెలిపారు.

యువ వైద్యులు పరిశోధనలు చేపట్టేలా ప్రోత్సహించడానికి ఇండియా అలయన్స్ డెవలపింగ్ ఇండియన్ ఫిజిషియన్ సైంటిస్ట్స్ (ఆఎఖూ) పేరిట వర్క్‌షాప్‌లు నిర్వహించడం ప్రారంభించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాలు, సంబంధిత శాస్త్రాల మధ్య అవగాహన పెంపొందించడానికి వర్క్‌షాప్‌లు జరుగుతున్నాయన్నారు. దేశంలో ప్రజారోగ్య రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇండియా అలయన్స్ సహకారం అందిస్తుందని మంత్రి తెలిపారు. బహుళ రంగ పరిశోధనలు ప్రోత్సహిస్తున్న ఇండియా అలయన్స్ పన్ హెల్త్ రీసెర్చ్, హృదయ సంబంధ వ్యాధులు, అంటువ్యాధులు, గర్భాశయ క్యాన్సర్, మధుమేహం, గిరిజన ఆరోగ్యంపై పరిశోధనలు చేపట్టేందుకు సహకారం అందించిందన్నారు.

క్లినికల్, ప్రజారోగ్య రంగాలను పటిష్టం చేయడానికి ఇండియా అలయన్స్ అమలు చేస్తున్న చర్యలు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఇండియా అలయన్స్ సహకారంతో చేపట్టిన పరిశోధనల వల్ల చర్మ సంబంధిత వ్యాధులకు .ప్రత్యామ్నాయ చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు.పోషక జీవ లభ్యతను అంచనా వేయడానికి నూతన విధానాలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. రాబిస్ పరిశోధనలో పన్ హెల్త్ విధానం,క్షయవ్యాధి చికిత్స కోసం టెలి-హెల్త్ విధానం అందుబాటులోకి వచ్చాయని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

వైద్య రంగానికి సంబంధించిన సమాచారాన్ని ఎక్కువగా వ్యాప్తి చేసి, శాస్త్రీయ రంగంలో ప్రజలు పాల్గొనేలా ప్రోత్సహించడానికి కార్యక్రమాలు అమలు జరగాల్సి ఉంటుంది. దీనికోసం యువ శాస్త్రవేత్తల వ్రాతపూర్వక, మౌఖిక సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రతి ఏడాది సైన్స్ కమ్యూనికేషన్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. దీనివల్ల యువ శాస్త్రవేత్తలు తమ రంగాలలో మరింత రాణించడానికి అవకాశం కలుగుతుంది. ప్రజలకు కూడా శాస్త్రీయ అంశాలపై అవగాహన, ఉత్సాహం కలుగుతాయి.

సదస్సులో పరిశోధకులు తమ పరిశోధన ఫలితాలు అందిస్తారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. బయో మెడికల్ రంగంలో సాధించిన ప్రగతి, వ్యాధి ఎదుర్కోగల సామర్థ్యం, అంటువ్యాధులు, మాతా శిశు ఆరోగ్యం, పశు వైద్య రంగంలో చేపట్టిన పరిశోధనలు లాంటి అంశాలు చర్చిస్తారు. ప్రజారోగ్య రంగంలో ప్రజల భాగస్వామ్యం, కృత్రిమ మేధస్సు వినియోగం లాంటి అంశాలను సదస్సులో చర్చించి దీనికి అవసరమైన సహకారం, వ్యవస్థ అభివృద్ధి, భవిష్యత్ అవసరాలు లాంటి అంశాలపై సదస్సు చర్చించి, సవాళు ఎదుర్కోవడానికి అనుసరించాల్సిన విధానాలు, నూతన అవకాశాలు, ఆవిష్కరణలు, సాధించిన ప్రగతిపై సదస్సులో నిపుణులు ప్రసంగిస్తారని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

మంచికి, అభివృద్ధికి మారుపేరు స్వర్గీయ నల్ల భీమ్ రెడ్డి రాంరెడ్డి- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ఆదిలాబాద్, జులై 14:మంచికి, మారుపేరు నల్ల కుటుంబం నల్ల భీమ్ రెడ్డి నల్లా రామ్ రెడ్డిల సేవలు చిరస్మరణీయంగా గుర్తుండిపోతాయని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాడ్యల్ గ్రామంలో నిర్మల్ పంచాయతీ సమితి మాజీ అధ్యక్షులు నల్ల భీమ్ రెడ్డి, ఆయన కుమారులు వడ్యాల్ మాజీ సర్పంచ్ నల్ల రామ్ రెడ్డిల విగ్రహాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ? నల్లభీమ్ రెడ్డి నల్లారామిరెడ్డిలు చేసిన సేవలు చిరస్మరణీయంగా గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు గుర్తుంచుకుంటారన్నారు. వారు ఆనాటి కాలంలోనే ముందుచూపుతో సాగునీరు, విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టితో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు.

భీమ్ రెడ్డి సమితి అధ్యక్షునిగా గ్రామ సర్పంచ్ గా రామ్ రెడ్డి గ్రామ సర్పంచ్ గా నాయకునిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని రామ్ రెడ్డి జార్జి రెడ్డి నమకాలీకుడని కొనియాడారు. నల్ల కుటుంబ సభ్యులు గ్రామంలో తమ సొంత స్థలాలను గ్రామపంచాయతీ పశు వైద్యశాల రోడ్డు మార్గానికి ఇచ్చి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లారన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్నీ లింగన్న మాట్లాడుతూ? నల్లభీమ్ రెడ్డి నల్ల రాంరెడ్డిలు గ్రామానికి చుట్టుపక్కల గ్రామాలకు చేసిన సేవలను క్లుప్తంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ జెడ్పిటిసి రాజేశ్వర్, సర్పంచ్ లలిత రామ్ రెడ్డి, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ రామ్ కిషన్ రెడ్డి, నల్ల వారి కుటుంబ సభ్యులు మాజీ ఎంపీపీ నరేందర్ రెడ్డి, వికాస్ రెడ్డి, కల్పనా రాంరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, తహసిల్దార్ కవితా రెడ్డి, మాజీ జెడ్పిటిసి నారా గౌడ్, లింగాగౌడ్, సల్లా సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్చార్జ్ అల్లోల సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నియోజకవర్గంలో నుంచి వచ్చిన పలు రాజకీయ పార్టీల నాయకులు, నల్ల కుటుంబ సన్నిహితులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వర్గీయ నల్ల భీమ్ రెడ్డి రామిరెడ్డి విగ్రహాలకు కుచడి శ్రీహరి రావు నివాళులర్పించారు. నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచాడి శ్రీహరి రావు కార్యక్రమానికి హాజరై రాంరెడ్డి భీమిరెడ్డి విగ్రహాలకు అర్పించారు. ఈ సందర్భంగా వారితో తనకున్న సంబంధాల గురించి గుర్తుచేసుకున్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

సీ పీ ఎస్ టీ ఈ ఏ టీ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా "మాచన"

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సీ పీ ఎస్ రద్దయ్యే వరకు అలుపెరుగని పోరాటమే శరణ్యమని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ టీచర్స్ ఎంప్లాయ్స్ అసోసియేషన్ తెలంగాణా రాష్ట్రం(సీ పీ ఎస్ టీ ఈ ఏ టీ ఎస్)భాగస్వామ్య పింఛను పథకం ఉపాధ్యాయ ఉద్యోగ సంఘ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మాచన రఘునందన్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు ఆయన హైదరాబాద్ లో మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా తొంభై లక్షల ఉద్యోగులు కొత్త పింఛను పథకం లో ఉన్నారని ప్పారు.ఉద్యోగ,ఉపాధ్యాయ శ్రేణులకు, సీ పీ ఎస్ టెన్షన్ స్కీమ్ గా పరిణమించిందన్నారు. దీన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకం ను నరుద్ధరించాలని కోరుతూ..చేసిన ఉద్యమాల ఫలితంగా దేశం లోని పలు రాష్ట్రాలు సహా ఆంధ్ర ప్రదేశ్ లో సైతం గ్యారంటి పెన్షన్ స్కీమ్ అమలుకు పాలకులు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.భాగస్వామ్య పింఛను పథకం రద్దు కోసం పాలకులను ఒప్పించేలా..కార్యాచరణ ప్రణాళికను, శనివారం నాడు హైదరాబాద్ లో జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో రూపొందించడం జరుగుతోందని చెప్పారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్ విచ్చేస్తున్నట్లు తెలిపారు.సీ పీ ఎస్ రద్దు కోసం ఉపాధ్యాయ ఉద్యోగ శ్రేణులు ఏక తాటి పైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగం అంటేనే భద్రత అని,సీ పీ ఎస్ లో జమ అవుతున్న డబ్బులు షేర్ మార్కెట్ లాభ నష్టాల పై ఆధారపడి ఉండటం వల్ల ఉద్యోగికి టెన్షన్ తప్ప మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 2004 సెప్టెంబర్ నుంచి కొత్త పింఛను పథకం అమలులో కి వచ్చిందని వివరించారు.

వరద ప్రభావిత రాష్ట్రాల్లో ఐఏఎఫ్ సహాయక చర్యలు

న్యూఢిల్లీ, జులై 14: వరద ప్రభావిత హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో 'మానవత సాయం ఉ విపత్తు సహాయ కార్యక్రమాలను' భారత వైమానిక దళం (ఐఏఎఫ్) చేపడుతోంది. గత 48 గంటల్లో మొత్తం 40 కార్యకలాపాలు చేపట్టి 126 మందిని రక్షించింది, వివిధ ప్రాంతాల్లో 17 టన్నుల సహాయ సామగ్రిని పంపిణీ చేసింది.

గత 24 గంటల్లో, హరియాణాలోని వరద బాధిత ప్రాంతాల్లోనూ సహాయ కార్యకలాపాలు నిర్వహించింది. నిహార, అల్లావుద్దీన్ మజ్రా, బిషన్‌గఢ్, సెగ్తా, భున్ని, ముమ్ని, సెగ్ది, జాన్సుయ్ గ్రామాలకు ఎం-17 హెలికాప్టర్ల ద్వారా ఆహార పదార్థాలు, టార్పాలిన్ షీట్లు, తాజా ఆహారం, మంచినీటి బాటిళ్లను అందజేసింది.

సాహితీ కిరణం ఆవిష్కరణము
సాహితీకిరణం సౌజన్యంతో కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్
'అనాథ బాలల అవస్థలు' అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి కవితలపోటీ
విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, కవిసమ్మేళనం
ముఖ్యఅతిథి : ఆచార్య కొలకలూరి ఇనాక్
పూర్వ ఉపాధ్యక్షులు,శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు-నేటినిజం
గౌరవ అతిథి : శ్రీ గుడిబండి వెంకటరెడ్డి
గౌరవ సంపాదకులు-సాహితీకిరణం
విశిష్ట అతిథి : డా॥వై.రామకృష్ణారావు
ప్రముఖ సాహితీవేత్త
సభాప్రారంభకులు : శ్రీ పాత్తూరి సుబ్బారావు
సంపాదకులు-సాహితీకిరణం
కవిసమ్మేళనం నిర్వహణ : శ్రీ రమణవెలమకన్ని
కవి, విమర్శకులు
కవితల పోటీ విజేతలు
ప్రథమ బహుమతి: రూ॥3000/-:డా॥మల్లిపురి రవిచంద్ర-హైదరాబాద్
ద్వితీయ బహుమతి: రూ॥2000/-:మామిడిపెద్దే శ్రీనివాసరావు-దొడ్డిపట్ల
8 సమాన బహుమతులు రూ॥1000/- చొప్పున
1) డా॥తోట్ల్యాపగేజ-న్యూఢిల్లీ,
2) మంత్రవాది మహేశ్వర్-హైదరాబాద్,
3) లోయిన భాస్కర్-సికింద్రాబాద్,
4) అవ్వారు శ్రీధర్‌బాబు-నెల్లూరు,
5) పంతంగి శ్రీనివాసరావు-హైదరాబాద్,
6) పాత్తూరి సీతారామరాజా-కాకినాడ,
7) పట్టా పించలయ్య-నెల్లూరు,
8) బి.కళాగోపాల్-నిజామాబాద్
కవి సమ్మేళనంలో పాల్గొను కవులు, కవయిత్రులు
శ్రీ మౌనశ్రీమల్లిక్, శ

రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందంటే అది ఆంధ్రప్రదేశే: ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, జులై 14:దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా అంటే అది ఆంధ్రప్రదేశ్ అని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ (ఇతీతినీశ్రీశ్రీజీ ాతీతినితిలజీబ) అన్నారు. తెలంగాణ ప్రజలకు కించపర్చేలా మాట్లాడితే ఇక్కడికి రావొద్దని చెప్పారు. ఏపీ నేతలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని వెల్లడించారు. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ అని తెలిపారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణపై ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంపై దండయాత్ర చేసి దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మీకు తెలంగాణ రాష్ట్రంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

ఉమ్మడి ఏపీలో ఏపీపీఎస్సీని చీపీపీఎస్సీ అని మీడియా, పత్రికలు రాసిన వార్తలు మర్చిపోయారా అని బొత్స నత్యనారాయణను ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు ఎన్ని గురుకుల పాఠశాలలు, డిగ్రీ కాలేజీలు ఉన్నాయో చెప్పాలన్నారు. మీ పాలనలో 60 ఏండ్ల కాలంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. మీరు రాజకీయ విమర్శలు చేస్తే ఆంధ్ర రాష్ట్రంలో చేసుకోవాల కానీ, తెలంగాణ గురించి మాట్లాడితే ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హితవుపలికారు. ఇలాగే మాట్లాడితే హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో దిగనివ్వమని స్పష్టం చేశారు.

తెలంగాణ సమాజంపైన, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ విద్య బాగాలేదని.. ఏపీకి చెందిన 80 వేల మంది విద్యార్థులు తెలంగాణలో బీటెక్ కోర్సులు చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్రం విడిపోయి పదేండ్లు కావొస్తున్నా ఇప్పటికీ రాజధాని దిక్కులేదని, అందుకే తెలంగాణ వైపు ఏపీ విద్యార్థులు వస్తున్నారని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిని చూసి కేంద్రమే అవార్డులు ఇస్తున్నదని చెప్పారు.

అబద్ధాలతో బతికే వ్యక్తి అరవింద్

అబద్ధాలతో బతికే వ్యక్తి ఎంపీ ధర్మపురి అరవింద్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్‌కు పసుపుబోర్డు తీసుకొస్తానని సంతకం చేశాడని, ఇప్పటికీ అది రాలేదన్నారు. దమ్ముంటే పసుపుబోర్డు గురించి మాట్లాడాలని సవాల్ విసిరారు. నిజామాబాద్ ప్రజలకు ఏం చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేంద్రం ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. అయినప్పటికీ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 33 మెడికల్ కాలేజీలు కట్టుకున్నామని చెప్పారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేశామని, ప్రజలకు సర్కారు వైద్యంపై నమ్మకం పెరిగిందన్నారు. వైద్యరంగంలో తెలంగాణ మూడో స్థానంలో ఉందని కేంద్రమే చెప్పిందని గుర్తుచేశారు.

సాంప్రదాయ ఔషధాలపై ఆసియాన్ దేశాల సదస్సుకు భారతదేశం ఆతిథ్యం

న్యూఢిల్లీ, జులై 14:విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆసియాన్‌కు భారత మిషన్ మరియు ఆసియాన్ సెక్రటేరియట్ మద్దతుతో ఆయుష్ మంత్రిత్వ శాఖ 20 జూలై 2023న ఆసియాన్ దేశాల కోసం సాంప్రదాయ ఔషధాలపై సదస్సును నిర్వహించనుంది. ఇందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ సన్నాహాలు చేస్తోంది. సాంప్రదాయ ఔషధాలపై సమావేశం భారతదేశం మరియు ఆసియాన్ దేశాల మధ్య వేదికను బలోపేతం చేయడానికి వారి ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి మరియు సాంప్రదాయ ఔషధాల రంగంలో భవిష్యత్ సహకారం కోసం ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడాన్ని ఇది లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రోజు ఏర్పాటు చేసిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మీడియాను ఉద్దేశించి ఆయుష్ కేంద్ర మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ "భారతదేశం మరియు ఆసియాన్ల మధ్య బహుముఖ సంబ ంధం భాగస్వామ్య భౌగోళిక, చారిత్రక మరియు నాగరికత సంబంధాల యొక్క బలమైన పునాదిపై ఉంది. ఇది చాలా పురాతనమైనది. రెండు సహస్రాబ్దాలకు పైగా ఈ సంబంధం కొనసాగుతోంది." అని అన్నారు. "నవంబర్ 2014లో మయన్మార్‌లో జరిగిన 12వ ఆసియాన్ ఇండియా సమ్మిట్‌లో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'ని ప్రకటించారు, ఇది వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త ఊతమిచ్చిం దన్నారు. దాదాపు ఒక దశాబ్దం తర్వాత సాంప్రదాయ వైద్యంపై భారత ఆసియాన్ సదస్సు జరగడం, ఆసియాన్‌తో భారతదేశ సహకారాన్ని మరింతగా పెంచుకోవడంలో ఒక ప్రధాన ముందడుగు. మంత్రిత్వ శాఖ సాధించిన విజయాల గురించిన వివరాలను పంచుకుంటూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 సంవత్సరం నుండి ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ క్రింద ఆయుష్ శాఖను పెంచినప్పటి నుండి గత 9 సంవత్సరాలలో ఆయుష్ రంగం అనేక రెట్లు అభివృద్ధి చెందింది. ఆయుష్ ఒక స్వతంత్ర మంత్రిత్వ శాఖగా

ఎదిగింది" అన్నారు. ఈ రోజు మంత్రిత్వ శాఖ బ్రిటిష్, అమెరికా, జపాన్, బ్రెజిల్, జర్మనీ నుండి అనేక అగ్రశ్రేణి అంతర్జాతీయ సంస్థలతో పాటు సీఎస్ఐఆర్, డి.ఎస్.టి, డి.బి.టి, ఐఐటీలు మొదలైన జాతీయ సంస్థలతో వివిధ నాన్-కమ్యూనికేబుల్ వ్యాధి పరిస్థితులలో ఆయుష్ వ్యవస్థలపై అధిక నాణ్యత పరిశోధనను చేపట్టేందుకు నిమగ్నమై ఉంది. డయాబెటిస్ మెల్లిటస్, క్యాన్సర్, మానసిక ఆరోగ్యం అలాగే కోవిడ్ వంటి అంటు వ్యాధులపై పరిశోధనలో కూడా నిమగ్నమై ఉంది. ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేయబడిన వివిధ ప్రాజెక్టుల పరిశోధన ఫలితాలను పంచుకోవడానికి ఆసియాన్ సదస్సు వేదికను అందిస్తుంది. అదేవిధంగా, ఆసియాన్ దేశాలు కూడా తమ అనుభవాలను పంచుకుంటాయి. ఈ సదస్సు లక్ష్యాలను ఆయన మరింతగా హైలైట్ చేస్తూ.. "సాంప్రదాయ వైద్యాన్ని ప్రోత్సహించడానికి ఆసియాన్ సభ్య దేశాలలో రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌లో ఇటీవలి పరిణామాలను పంచుకోవ డానికి కూడా ఈ సమావేశం ఒక వేదికను అందిస్తుంది" అని కేంద్ర మంత్రి తెలిపారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆయుష్ ఉత్పత్తులు మరియు సేవల ఎగుమతిని పెంచడానికి ఆయుష్‌లో బలమైన అంతరాతీయ సహకారాన్ని ఏర్పాటు చేసుకుంది. 'సాంప్రదాయ ఔషధాల రంగంలో సహకారం', 'ఆయుష్ పీఠాల ఏర్పాటు'పై అవగాహన ఒప్పందాలపై విజయవంతంగా సంతకం చేసింది. విదేశీ విశ్వవిద్యాలయాలు/ఇన్‌స్టిట్యూట్‌లలో మరియు వివిధ స్థాయిలలో 'సహకార పరిశోధన' చేపట్టడం కోసం ఒప్పందాలు జరిగాయి. ఇది ఆసి యాన్‌లోనే కాకుండా ఇతర దేశాల్లో కూడా ఆయుష్‌కు బలమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ ఒకరోజు సద స్సులో మొత్తం 75 మంది పాల్గొన నున్నారు. ఎనిమిది ఆసియాన్ దేశాల నుండి అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొంటారు. ఇద్దరు అంతర్జాతీయ ప్రతినిధులు వర్చువల్ మోడ్ ద్వారా ఆలోచనలు చేసి సంప్రదాయ ఔషధా లపై తమ ఆలోచనలను పంచుకుంటారు.

విశాఖ బీసీ గర్జన పోస్టర్ ఆవిష్కరించిన టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి

విశాఖపట్నం జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఈ నెల 16న విశాఖ పట్టణం లో జరిగే బీసీ గర్జన కార్యక్రమం వాల్ పోస్టర్ని టిటిడి చైర్మన్ ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్చార్జ్ వైవి సుబ్బారెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో మేయర్ గొల్లగాని వెంకట హరి కుమారి, శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి ,, వాసుపల్లి గణేష్, విశాఖ బీసీ గర్జన నిర్వాహకుడు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కరివేణుమాధవ్ విశాఖపట్నం మహిళా నాయకురాలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబు ఏజెంట్ రేవంత్‌రెడ్డి : స్పీకర్ పోచారం

కామారెడ్డి, జులై 14: (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ. రైతులకు 3 గంటలు కరంటు ఇవ్వాలని రేవంత్ స్పష్టంగా చెప్పాడు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రైతులపై కాంగ్రెస్ పార్టీ ఉద్దేశాన్ని తెలియజేస్తున్నాయి. ఉచిత విద్యుత్తుపై పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా, మతిభ్రమించి వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. వ్యవసాయం, రైతుల గురించి రేవంత్ రెడ్డికి ఏమాత్రం అవగాహన లేదని పోచారం తెలిపారు. సాగునీటి రంగంపై గత పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణ లో బోర్లు పెరిగాయన్నారు. రైతుల పొట్ట కొట్టే విదంగా రేవంత్ రెడ్డి మాట్లాడాడు.రైతులను తప్పుదోవ పట్టిస్తూ సిగ్గు లేకుండా ధర్నాలు చేస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేస్తున్న పనులు అర్థం పర్థం లేనివని, హైదరాబాద్ చుట్టూ పక్కల రైతులను భయపెట్టి భూ కబ్జాలు చేసే వ్యక్తి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి కేసీఆర్.వ్యవసాయాన్ని దండగ అన్న వ్యక్తి చంద్రబాబు అయితే దాన్ని పండుగ చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. చంద్రబాబు డైరెక్షన్లోనే రేవంత్ నాటకాలు ఆడుతున్నాడని మండిపడ్డారు.పీసీసీ పదవిని రేవంత్ కు ఇప్పించిందే చంద్రబాబు అని పేర్కొన్నారు. చంద్రబాబు ఏజెంట్ రేవంత్.

చంద్రబాబు రేవంత్ ఇద్దరూ ఒక్కటేనని చెప్పారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి ఖాయమని, సర్వేలు కూడా ఇదే విషయాన్నిచెబుతున్నాయని పోచారం తెలిపారు. తెలంగాణలో ప్రతిపక్షాల ఆటలు సాగవన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఆఅఆః చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు డి అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ చైర్మన్ కృష్ణా రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్ నాయక్, ఎజాజ్, పాత బాలకృష్ణ, దొడ్ల వెంకట్రామిరెడ్డి, బుల్లెట్ రాజు పాల్గొన్నారు.

ప్లాట్ ఫామ్ 65లో రైల్వే ఫీస్ట్

-రైల్వే సిబ్బందికి 18% ప్రత్యేక ఆఫర్ ను ప్రకటించిన ప్లాట్ ఫామ్ 65

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్); భారతదేశంలోని అతిపెద్ద టాయ్-ట్రైన్-నేపథ్య రెస్టారెంట్ అయిన ప్లాట్‌ఫామ్ 65, అంకితభావంతో పనిచేసే బారతీయ రైల్వే ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా 18% ప్రత్యేక తగ్గింపును ప్రకటించింది. మన నగరం రైల్వే నెట్‌వర్క్ కు వారి అమూల్యమైన సహకారానికి ప్రశంసా చిహ్నంగా, ప్లాట్‌ఫాం 65 రైల్వే ఉద్యోగులకు కృతజ్ఞత తెలుపుతూ వారికి మద్దతుగా ఈ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ తగ్గింపును పొందేందుకు, రైల్వే ఉద్యోగులు బిల్లింగ్ సమయంలో రెస్టారెంట్‌లో తమ రైల్వే ఉద్యోగి ఐడీ కార్డును చూపించాలి. ఈ ఆఫర్ ప్రత్యేకంగా రైల్వే సిబ్బంది కోసం రూపొందించబడింది. స్నేహితులు, కుటుం బ సభ్యులు, సహోద్యోగులతో ఆనందకరమైన భోజన అనుభవాన్ని ఆస్వాదించడానికి ప్లాట్‌ఫామ్ 65 వీలు కల్పిస్తుంది, అదే సమయంలో వారి మొత్తం బిల్లుపై 18% తగ్గింపును పొందే అవకాశం కూడా ఉంటుంది.భారతీయ రైల్వే వ్యవస్థ, దాని రైళ్ల నుండి ప్రేరణ పొందిన ప్లాట్‌ఫామ్ 65, ప్రత్యేకమైన, సంపూర్ణ అనుభూతి పొందే భోజన అనుభవాన్ని సృష్టించడానికి ఎల్లప్పుడూ ఆలోచిస్తుంటుంది. ప్లాట్‌ఫామ్ 65లో, కస్టమర్‌లు నిపుణులైన చెఫ్‌ల ప్రత్యక్ష, క్లిష్టమైన పర్యవేక్షణలో తయారుచేయబడిన నోరూరించే వంటకాలను ఆనంది స్తారు. రైల్వే ఉద్యోగుల కోసం ఈ ప్రత్యేక ఆఫర్‌తో, ప్లాట్‌ఫామ్ 65 స్థానిక రైల్వే సంఘంతో తన అనుబంధా న్ని బలోపేతం చేయడం, వారి సేవకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా, ప్లాట్‌ఫామ్ 65 మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకులు సద్గుణ్ పథ మాట్లాడుతూ, "ఈ ప్రత్యేక ఆఫర్‌ను మన నగరంలోని అంకితమైన రైల్వే ఉద్యోగులకు విస్తరించడానికి నేను నిజంగా సంతోషి స్తున్నాను. మన స్థానిక రైల్వే నెట్‌వర్క్ ను సజావుగా నడిపించడంలో వారు కీలక పాత్ర పోషిస్తారు. వారికి ఈ ప్రత్యేక తగ్గింపును అందించడం ద్వారా మా మద్దతును తెలియజేయడం మాకు గౌరవంగా ఉంది. వారు ప్లాట్‌ఫామ్ 65లో మాతో చేరి, ప్లాట్‌ఫామ్ 65 అవుట్ లెట్‌లలో మా ఆహ్లాదకరమైన మెనూ ఆఫర్‌లను ఆ స్వాదిస్తూ విలక్షణమైన రైలు నేపథ్య వాతావరణాన్ని ఆస్వాదిస్తారని మేం ఆశిస్తున్నాం"" అని అన్నారు."మన స్థానిక రైల్వే ఉద్యోగుల కృషిని గుర్తించడం, అభినందించడం చాలా అవసరం. ఈ తగ్గింపు మా కృతజ్ఞతకు ఒక చిన్న గుర్తు. ఇది వారికి ఆనందాన్ని కలిగిస్తుందని, మా అసాధారణమైన వంటకాలు, సంపూర్ణ అనుభూతి చెందే రైలు నేపథ్య వాతావరణాన్ని అనుభవించడానికి ప్లాట్‌ఫామ్ 65ని సందర్శించాల్సిందిగా వారిని ప్రోత్సహిస్తుందని మేం ఆశిస్తున్నాం" అని ప్లాట్ ఫామ్ 65 వైస్ ప్రెసిడెంట్ శ్రీ వెంకటేష్ తెలిపారు.ప్లాట్‌ఫామ్ 65, రైల్వే ఉద్యోగుల కోసం ప్రత్యేక తగ్గింపు గురించి మరింత సమాచారం కోసం, దయచేసి మా వెబ్‌సైట్‌ను సందర్శించండి: https://platform65.in/

పారదర్శకంగా దళితబంధు అమలు-కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, జులై 14: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం పారదర్శకంగా అమలు చేస్తున్నట్టు రాష్ట్ర ఎస్సి అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. శుక్రవారం కరీంనగర్ లోని తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణల్లో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల ప్రకారమే దళిత బంధు లబ్దిదారుల ఎంపిక జరుగుతుందని చెప్పారు. మొదటి దశలో ఎమ్మెల్యేల సూచనతో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడంపై అపోహలు రావడంతో.. జిల్లా కలెక్టర్లకే ఆ బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు.సంబంధిత జిల్లా మంత్రులు జిల్లా కలెక్టర్లతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. దళిత బంధు రెండో విడతలో ప్రభుత్వం కేటాయి ంచిన 17వందల కోట్ల రూపాయల నిధుల్లో ఇప్పటికే 850 కోట్లు వచ్చి ఉన్నాయని మంత్రి చెప్పారు. దశల వారీగా ప్రతి దళిత కుటుంబానికీ పథకం వర్తింపజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్వరాష్ట్రంలో దళిత, బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో సమూలమైన మార్పుల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. విద్య, వైద్య పరంగా అట్టడుగు వర్గాల పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు.

ముఖ్యంగా స్వాతంత్రానంతరం నుంచి కూడా అంటరానితనానికి, వివక్షకు గురైన దళిత కుటుంబాల్లో మార్పులు తేవాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ దళితబంధుకు రూపకల్పన చేశారని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ప్రతి దళిత కుటుంబానికీ పది లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచడమే ఈ పథకం లక్ష్యమన్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా లబ్ధిపొందిన దళిత కుటుంబాలు ఆర్థిక వికాసం వైపు అడుగులు వేస్తున్నాయని.. ఉపాధి పొందుతూ లబ్ది దారులు నలుగురికి ఉపాధి కల్పిస్తూ ప్రయోజనం పొందుతున్నారని వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జ కూడా పాల్గొన్నారు.

మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి జనరిక్ మందులు

- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ కార్యదర్శి సాయి చౌదరి

వికారాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు అని, పేద, మధ్యతరగతి ప్రజలకు మందులు కొనుగోలు భారంగా మారిందని ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనరిక్ మందుల విధానం ప్రజలకు అందించాలని ఉద్దేశంతోనే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో జనరిక్ మందుల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ గౌరవ కార్యదర్శి సాయి చౌదరి మాట్లాడుతూ పేటెంట్ హక్కులు ముగిసిన ఔషధాలు ఆ తరువాత జనరిక్ మందుల రూపంలో అందుబాటులోకి వస్తాయని, ఔషధ మేళవింపు పనితీరులో ఎలాంటి తేడా ఉండనప్పటికీ అవి జనభాహు ల్యంలో తగినంత ఆదరణ పొందలేకపోతున్నాయని, బ్రాండెడ్ ఔషధాలలో పోలిస్తే జనరిక్ ఔషధాలు 80 శాతం తక్కువ ధరకే లభ్యమవుతాయని సాయి చౌదరి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ భక్తవత్సలం మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో లభ్యమవుతున్న ఔషధాలలో దాదాపు 75 శాతం జనరిక్ రూపంలోనే అందుబాటులో ఉన్నాయని, రోగులు మాత్రం జనరిక్ దుకాణాలనుంచి అధిక రక్తపోటు, మధుమేహము, కొలెస్ట్రాల్, విటమిన్ లోపం వంటి మందులనే ఎక్కువగా కొంటున్నారని, వైద్యుల సైతం సామాన్యులను దృష్టిలో ఉంచుకొని జనరిక్ ఔషధాలను సిఫార్సు చేయటంతో పాటు వాటి పట్ల అపోహలను తొలగించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ విషయంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జనరిక్ మందుల పై అవగాహన కార్యక్రమాలను కళాశాల లలో విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమమునకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సత్యనారాయణ గౌడ్, విశ్వ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థి విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సెంథిల్ బాలాజీని కస్టడీలోకి తీసుకునే హక్కు ఈడీకి ఉంది: మద్రాస్ హైకోర్టు

చెన్నై, జులై 14: క్యాష్ ఫర్ జాబ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీని కస్టడీలోకి తీసుకునే హక్కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) కు ఉన్నదని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ సీవీ కార్తికేయన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. తన భర్తను ఈడీ కస్టడీలోకి తీసుకోవడం అక్రమం అంటూ సెంథిల్ బాలాజీ భార్య మేఘల వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.

కాగా, క్యాష్ ఫర్ జాబ్ కేసులో ఆరోపణలు రావడంతో ఈడీ గత నెల 14న సెంథిల్ బాలాజీని అరెస్ట్ చేసింది. అయితే ఆ తర్వాత ఆయన ఛాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించింది. చికిత్స అనంతరం కోర్టులో హాజరుపర్చి జైలుకు పంపింది. ఈ క్రమంలో నిందితుడి భార్య వేసిన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన హైకోర్టు.. సెంథిల్ బాలాజీ ఆస్పత్రిలో ఉన్న సమయాన్ని కస్టడీ పీరియడ్ నుంచి మినహాయించాలని పేర్కొన్నది. నిందితుడి అరెస్ట్ లీగల్ అయినప్పుడు అతని రిమాండ్ కూడా లీగలే అవుతుందని వ్యాఖ్యానించింది.

బేస్టిల్ డే పరేడ్‌లో గౌరవ అతిథిగా పాలుపంచుకొన్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 14:ఫ్రాన్స్ అధ్యక్షుడు మాన్య శ్రీ ఇమేన్యుయెల్ మేక్రాన్ ఆహ్వానించిన మీదట ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 జులై 14 వ తేదీ నాడు చాంప్స్ ఎలిసీస్ లో జరిగిన బేస్టిల్ డే పరేడ్ కు గౌరవ అతిథి గా హాజరు అయ్యారు.

భారతదేశం-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యాని కి 25 సంవత్సరాలు అయిన ఘట్టాని కి సూచిక గా భారతీయ సాయుధ దళాల కు చెందిన 241 మంది త్రివిధ బలగాల సభ్యులు ఒక మిలిటరీ బ్యాండ్ నాయకత్వం లో ఈ పరేడ్ లో పాలుపంచుకొన్నారు. భారతీయ సైన్య జట్టు కు పంజాబ్ రెజిమెంట్ తో పాటు, రాజ్ పుతానా రైఫిల్స్ రెజిమెంట్ నేతృత్వం వహించింది.

హాశీమారా యొక్క 101 స్క్వాడ్రన్ తాలూకు భారతీయ వాయుసేన కు చెందిన రాఫెల్ జెట్ విమానాలు ఈ పరేడ్ లో భాగం గా జరిగిన ఫ్లయ్ పాస్ట్ లో భాగం అయ్యాయి.

ఫ్రెంచ్ విప్లవం కాలం లో 1789 వ సంవత్సరం జులై 14 వ తేదీ నాడు బేస్టిల్ కారాగారాన్ని ముట్టడించిన సన్నివేశాని కి సూచిక గా ఏటా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇది భారతదేశం మరియు ఫ్రాన్స్.. ఈ రెండు రాజ్యాంగాల కు కేంద్రీయ ఇతివృత్తం గా ఉన్నటువంటి 'స్వేచ్ఛ, సమానత్వం మరియు సోదరభావం' అనే ప్రజాస్వామిక విలువల కు ప్రతీక గా కూడా ఉంటున్నవి.

షిరిడీ సాయి సేవలో కోలేటి.. సీఎం కేసీఆర్‌ను దీవించాలని ప్రార్థన

హైదరాబాద్, జులై 14:షిర్డి సాయిబాబాను తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఇవ్వాల (శుక్రవారం) దర్శించుకున్నారు. మధ్యాహ్నం హారతిలో పాల్గొన్న దామోదర్ తదనంతరం బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ సీఎం కేసీఆర్ కు సంపూర్ణ త్వరలో జరగబోయే తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ విజయం ఖాయమని కోలేటి చెప్పారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం పీఠాన్ని అధిష్టించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వుండాలని రాష్ట్రం మరింత అభివృద్ధి సంక్షేమ దిశగా అడుగువే యాలని బాబాను కోరుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని బాబాను ప్రార్థించానన్నారు.



గోవాలో ఆయుష్ ఆరోగ్య సేవలు, పరిశోధన సౌకర్యాలు ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 14:గోవాలోని రిబందర్‌లో ఆయుష్ ఆరోగ్య సేవలు, పరిశోధన సౌకర్యాలను ఆయుష్ మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తెచ్చింది. స్థానిక ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన ఆయుష్ ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావ డానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. ఖనిజ, సముద్ర మూలాలు ఉన్న ఔషధాలపై పరిశోధన చేపట్టడానికి మ్యూజియం, గ్రంథాలయం, ప్రయోగశాలను కూడా ఏర్పాటు చేయాలని ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

రిబందర్‌లో ఆయుష్ ఆరోగ్య సేవలు, పరిశోధన సౌకర్యాలను గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ , ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ యెస్సో నాయక్, గోవా ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ విశ్వజిత్ రాణే ఆయుష్ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్ర ఆయుష్ ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ మాట్లా డారు. సాంప్రదాయ వైద్యాన్ని ప్రోత్సహించాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా గోవాలో ఆయుష్ ఆరోగ్య సేవలు ప్రారంభించామన్నారు ప్రాచీన వైద్య శాస్త్రం ద్వారా సమాజ సంక్షేమం సాధించవచ్చునని అన్నారు. ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళిక ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందన్నారు.

గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ ప్రాచీన వైద్యంలో ఆయుష్ ఒక విశిష్టమైన వ్యవస్థ అని అన్నారు. 2014లో ప్రత్యేకంగా ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రాచీన వైద్యం విధానం ప్రాధాన్యత గుర్తించారని అన్నారు. గోవా రాష్ట్రంలో పరిశోధనా సంస్థ ఏర్పాటు చేసిన కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయుష్ హెల్త్‌కేర్ హబ్‌గా గోవా మారుతుందన్నారు.

కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్, జలమార్గాలు,పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ యెస్సో నాయక్ మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానంతో సంప్రదాయ వైద్య విధానాన్ని ఏకీకరణ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. . పరిశోధనలను ప్రోత్సహించడానికి, ప్రతి గ్రామానికి ఆయుష్‌ను తీసుకెళ్లడా నికి తమ శాఖ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రజలు ఆయుష్ సేవలు పూర్తిగా పొందేలా చర్యలు తీసుకుంటా మన్నారు.

ఆరోగ్య సంరక్షణ పరిశోధన కేంద్రంలో అఅఖీయా ? మినరల్ అండ్ మెరైన్ మెడిసినల్ రిసోర్సెస్ ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ, అఅఖీఊ ? క్లినికల్ రీసెర్చ్ యూనిట్ (హోమియోపతి), అఅఖీ – సిద్ధ క్లినికల్ రీసెర్చ్ యూనిట్, అఅఖీజఐ – క్లినికల్ రీసెర్చ్ యూనిట్, అఅఖీజఓ ? యునాని స్పెషాలిటీ క్లినిక్ ఏర్పాటు చేశారు.దీనిలో ఓపీడీ,, డిస్పెన్సరీ, పంచకర్మ, ప్రయోగశాల కోసం సౌకర్యాలు కల్పించారు.

రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి అధిక నాణ్యత, సరసమైన ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఆరోగ్య సంరక్షణ పరిశోధన కేంద్రంలో నెలకొల్పిన సంస్థలు పని చేస్తాయి. మౌలిక సదుపాయాలు, మానవ వనరుల అభివృద్ధితో పాటు ప్రముఖ సంస్థలతో కలిసి సంప్రదాయ వైద్య వ్యవస్థలో పరిశోధనను ప్రోత్సహిం చడం, ఆధునిక వైద్య విధానంతో కలిపి ఆయుష్ సేవలకు ప్రాధాన్యత ఇవ్వడం, ఆవిష్కరణలను ప్రోత్సహిం చడానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు అమలు చేస్తోంది.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

మహా బూబ్ నగర్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్); మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో బీసీ సేన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీసేన కార్మిక విభాగం ఉమ్మడి మహా బూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, బీసీసేన జడ్చర్ల నియోజక వర్గం ప్రధాన కార్యదర్శి లింగం పేట్ శేఖర్ లు మాట్లాడుతూ ఈనెల 20 నుండి ప్రారంభమవుతున్న వర్షాకాల పార్లమెంటు సమావేశంలోబీసీ బిల్లు పెట్టి చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని , దేశ జనాభాగణనలో బీసీ కులగ లను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో మెజార్టీ ప్రజలైన బీసీలకు దేశానికి స్వతంత్రం వచ్చి 76సంవత్సరాలు అయినా నేటికి రాజ్యాంగ ఫలాలు అందకపోవడం సామాజిక న్యాయస్ఫూర్తికి విరుద్ధమని వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిసి సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ, లోక్ సభ సభ్యులు పార్టీలకతీతంగా పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి కృషి చేయాలని కోరారు,ఈ మండల అధ్యక్షులు బొల్లె వోని నిరంజన్ బీసీ సేన నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిలింగం పేట్ శేఖర్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, కార్మిక విభాగంమండల అధ్యక్షులు ఆకుల చంద్రమౌళి, జిల్లా నాయకులు మాచారం శ్రీనివాస్, కట్ట మురళి, మండల కార్య దర్శి సురభి రఘు, సురభి ఆంజనేయులు

ఎంజెఎఫ్ పాలకుర్తి నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

– మాదిగ జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతా

ఎంజెఎఫ్ పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ఎడవెల్లి సోమన్న

మహాబూబాబాద్, జులై 14:(నేటినిజం ప్రతినిధి): పాలకుర్తి నియోజకవర్గంలో ఉన్న మాదిగ జర్నలిస్టులు నియోజకవర్గ స్థాయి నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ పెద్దవంగర మండల కేంద్రంలోని సాయి గార్డెన్ లో జరిగింది. అధ్యక్షునిగా ఎడవెల్లి సోమన్న ,ఉపాధ్యక్షులుగా సుంకరి ఓంకార్ , ప్రధాన కార్యదర్శిగా మాచర్ల పరమేశ్వర్ , సహాయ కార్యదర్శిగా భాషిపాక ఎల్లేష్, కోశాధికారిగా చెరిపల్లి అశోక్, సలహాదారులుగా ఐత మల్లేష్, యాసారపు భాస్కరు, గారె సందీప్, బండిపెల్లి మధు, తీగల ఉపేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎడవెల్లి సోము మాట్లాడుతూ మాదిగ జర్నలిస్టులపై ,దళిత జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల పై, వారికున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారికి అన్ని విధాల సహకారిగా ఉంటానని తెలియజేశారు.ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు జలగం శ్రీనివాస్, చింతల ఐలయ్య, గంగారపు మధు, ఐత లక్ష్మణ్,జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 29న ఖమ్మంలో అమిత్ షా బహిరంగ సభ

ఖమ్మం జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఈనెల 29న ఖమ్మంలో అమిత్ షా సభ జరగనుందని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి తెలిపారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "గుజరాత్‌లో పెద్ద ఎత్తున తుఫాన్ కారణంగా చివరి నిమిషంలో ఖమ్మంలో అమిత్ షా బహిరంగ సభ వాయిదా పడింది. 9 ఏళ్లలో మోడీ ప్రభుత్వం చేసిన సేవ, సుపరిపాలన గురించే ఖమ్మంలో బహిరంగ సభ. వాయిదా పడిన సభ ఈ నెల 29న ఖమ్మంలో జరగనుంది. ఈ సభలో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీ ఏర్పాట్లలో పాల్గొంటాం. రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి వచ్చిన తర్వాత అందరం కలిసి ఏర్పాట్లు చేస్తాం. మా అంతర్గత రాజకీయాల్లో కూడా దుష్ప్రచారం చేస్తున్నారు. దళిత బంధు విషయంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తాం. ఎరువుల బస్తా మీద సుమారు 2 వేల సబ్సిడీ బీజేపీ ప్రభుత్వం ఇస్తుంది. బీజేపీ అమలు చేస్తున్న ఏ పథకాన్ని ప్రజల్లోకి వెళ్లకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుం టుంది. బీజేపీ ఎదుగుదల ఆగిపోయిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇరు పార్టీలు కలిసి పని చేస్తున్నాయి. నేను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నేనెప్పుడూ చూడని విధంగా గంజాయి సప్లై జరుగుతుంది. నేను చాలా బాధ్యతగా మాట్లాడుతున్నాను. గంజాయి మత్తుమందు, అక్రమ ఇసుక రవాణా విచ్చల విడిగా జరుగుతుంది. ఇటీవల జరిగిన యువమోర్చా నాయకుడు పవన్ సాయి హత్యపై కూడా సమగ్ర దర్యాప్తు చేయాలి." అని పొంగులేటి డిమాండ్ చేశారు.

తిరుమల స్వామివారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుపతి, జులై 14: తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్ట్‌మెంట్లు నిండిపోగా భక్తులు శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడ్డారు. నిన్న స్వామివారిని 67,300 మంది భక్తులు దర్శించు కోగా 32,802 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం (ఊబీనిటతి ఎనిఇనీఎవ) రూ.3.83 కోట్లు వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు.

16న డయల్‌యువర్ ఈవో

డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని జూలై 16న నిర్వహిస్తున్నట్లు ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు తమ సందేహాలను, సూచనలను ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చని సూచించారు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ముగ్గురు మృత్యువాత

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో పద్మ, ధనలక్ష్మి, అభినవ్ శుక్రవారం ఉదయం మృతి చెందారు. దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దోమలగూడ రోజ్ కాలనీలో ఈనెల 11న పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకేజీ అయి మంటలు అంటుకోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. అయితే గాయపడిన ధనలక్ష్మి కూతురు శరణ్య చికిత్స పొందుతూ ఈనెల 12న మృతి చెందింది. ఈరోజు తీవ్రంగా కాలిన గాయాలపాలైన పద్మ (53), ఆమె కూతురు ధనలక్ష్మి (28), ధనలక్ష్మి కుమారుడు అభినవ్ (7)లు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. దీంతో గ్యాస్ లీకేజీ అయి మంటలు అంటుకున్న ఘటనలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఒకే కుటుంబంలో నలుగురు మృత్యువాత పడటంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా చంద్రయాన్ -3 విజయవంతం పట్ల సంబరాలు

కరీంనగర్, జులై 14: (నేటినిజం ప్రతినిధి): స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో నిర్వహించినటువంటి చంద్రయాన్-3 విజయోత్సవ పట్ల స్థానిక కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడా రు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ భారతదేశానికి శాస్త్రవేత్తలు చాలా విశిష్టమైన సేవలు అందిస్తున్నారని మరియు వారు చేసే కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. వారి ద్వారా భారతదేశం అభివృద్ధి వైపు పయనిస్తున్నదని మరియు అగ్రదేశాలకు ధీటుగా పలు అంశాల లో ఘనవిజయం సాధిస్తూండడం చాలా గొప్ప శుభపరిణామమని తెలుపుతూ ప్రతి ఒక్కరికి అంతరిక్ష శాస్త్రం పట్ల అవగాహన ఉండడమే కాకుండా వాటిలోని అంశాలను విధిగా తెలుసుకొని నమూనాలను తయారు చేసి దేశానికి ఆదర్శంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.నేడు మన సమాజం అన్ని కోణాలలో అభివృద్ధి చెందాల్సిన ఎంతగానో ఉందని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యార్థులు పలు కార్యక్రమాలను చేపడుతూ వాటికి కావలసిన వనరులను సమకూర్చుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిరక్షించాలని కోరారు. అగ్రదేశాలైన అమెరికా, లండన్, కెనడాలో కూడా అంతరిక్షశాస్త్రం పట్ల ప్రత్యేక చొరవ చూపుతారని వాటిని అవలంబించే విధంగా ప్రేరణ కల్పించాలని అభిప్రాయపడ్డారు. నేడు సమాజంలో వివిధ సందర్భాలు ఎదురైనప్పటికి అంతరిక్ష శాస్త్ర ఎటువంటి నిర్లక్ష్యం వహించద్దని సూచించారు.భారతదేశం ఎంపిక చేసుకున్న ప్రజాస్వామ్యంలో ఉత్తమంగ పలు పరిశోధనలు చేపట్టి విశేషంగా రాణించాలని కోరారు. నేడు మన భారతదేశంలో శాస్త్రవేత్తలు అహర్నిశలు కృషిచేస్తూ ఇతర దేశాలకు ధీటుగా ఉంటున్నదని హర్షం వ్యక్తం చేస్తూ నేడు నింగిలోకి ప్రవేశపెడుతున్న చంద్రయాన్ - 3 ఇతర దేశాలకు ఒక గొప్ప పాఠం అని మరియు ఆదర్శనీయమని చెప్పారు. ఇది భారతదేశం నుండి మూడవ అంతరిక్ష సంబంధిత పరిశోధన అని మరియు ఎంతో జాగ్రత్తగగా మరియు రహస్యంగా రూపొందించడం జరిగిందని సుమారు 40 రోజుల తర్వాత అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశిస్తున్నదని చెప్పారు. చారిత్రాత్మక విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. మరియు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి భారతదే శాన్ని అగ్రస్థానంలో నిలిపారని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వరదలో కొట్టు కొచ్చిన పాల ప్యాకెట్లు - క్షణాలలో మాయం చేసిన జనం

హైదరాబాద్, జులై 14:బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా తీర ప్రాంతాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. మచిలీపట్నంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై మోకాళ్ల లోతు వరద చేరింది. ఆ వరదలో పాలప్యాకెట్లు కొట్టుకు వచ్చాయి.. మొదట ఆశ్చర్యపోయిన జనం తేరుకుని వాటిని ఏరుకునేందుకు ఎగబడ్డారు. క్షణాలలో ఆ పాల ప్యాకెట్లను మాయం చేశారు.. మోకాళ్ల లోతు నీటిలో పాల ప్యాకెట్లను ఏరుకుంటున్న జనాలను కొంతమంది వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో ఈ వీడియో కాస్తా ఇప్పుడు వైరల్ గా మారింది.

అనలు విషయానికి వస్తే సాయిబాబా ఆలయం జంక్షన్‌లో మోకాలిలోతు నీరు నిలిచింది. ఆ వరదలోనే అటుగా వెళ్తున్న ఓ వాహనం నుంచి పాల ప్యాకెట్ల ట్రేలు కిందపడ్డాయి. దీంతో పాల ప్యాకెట్లు కొట్టుకొచ్చాయి. వాటినే జనాలు అందినకాడికి పట్టుకుపోయారు..

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి

–బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్

హైదరాబాద్ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్ 0;చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ రవీంద్రభా రతిలో మహిళ నాయకురాల్లు సమావేశం ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చిన బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి 26ఏండ్లు పూర్తయినా రిజర్వేషన్లను అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. సామాజిక స్పూర్తికి విరుద్ధమని భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో అతిపెద్ద సంస్కరణ అయిన మహిళా రిజర్వేషన్ బిల్లు శీతలగిడ్డంగిలో సమాధి అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ మహిళా దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవాల సందర్భంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమాజంలో మహిళల పాత్రను వే న్నోళ్ల పొగుడుతారు కానీ రాజకీయరంగంలో వారికి సమ ప్రాధాన్యం కల్పించడానికి వెనకడుగు వేస్తారని అన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోబేడా బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షులుగగనం వెంకట్ స్వామి, సినీ దర్శకులుసేనా పతి,సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ సీఈవో పరమేశ్వరి, ఉషా నాగ (ఎ ్ న ్ హ ా న ా , హైకోర్టు న్యాయవాదిమంజుల, మేరీ,రమేష్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ కర్మాగారం విస్తరణతో ఉద్యోగ అవకాశాలు

సారపాక, జూలై 14 : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలోనే పారిశ్రామిక రంగం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతోందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పేర్కొన్నారు. పారిశ్రామిక కేంద్రమైన సారపాక ఐటీసీ వీఎన్‌పీడీలో(ఎఅటజీఇబినీతీఎ) సుమారు రూ.2,800 కోట్లతో 8వ నూతన ప్లాంట్ ఏర్పాటు చేస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని అన్నారు.

ఐటీసీలో విస్తరణ జరిగినప్పుడే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీలో ఎనిమిదో ప్లాంట్ (మెషీన్) విస్తరణ కోసం స్థానిక బీపీఎల్ స్కూల్ ప్లే గ్రౌండ్‌లో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, కాలుష్య నియంత్రణ మండలి రీజినల్ అధికారి భూక్యా రవీందర్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. కర్మాగారం విస్తరణ వల్ల ఈ ప్రాంతానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు.

1/70 చట్టం అమలులో ఉన్న ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించేందుకు కొత్త కంపెనీలేవీ ముందుకు రావడం లేదని, అందుకని ఇప్పటికే ఉన్న ఐటీసీని విస్తరించుకుంటే మన ప్రాంతంలోని ఎన్నో కుటుంబాలు ఉపాధి పొందుతాయని అన్నారు. కంపెనీ కూడా లాభాపేక్షతో కాకుండా పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించాలని, కాలుష్య రహిత పరిశ్రమగా ఉత్పత్తిని కొనసాగించుకోవాలని ఆకాంక్షించారు.

అదేవిధంగా గోదావరి వరదలు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఐటీసీ యాజమాన్యం నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నో సహాయ సహకారాలు అందించిందని గుర్తుచేశారు. మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ.. సుమారు రూ.3 వేల కోట్లతో ప్లాంట్ విస్తరణ జరగడం ఈ ప్రాంత అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన రైతులు ఐటీసీని నమ్ముకొని వేలాది ఎకరాల్లో జామాయిల్, నుబాబుల్ సాగుచేస్తున్నందున వారికి మద్దతు ధర కల్పించాలని కోరారు. పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న సంస్థకు ప్రభుత్వం కూడా అండగా నిలుస్తుందని చెప్పారు.

ఘనంగా విశాఖ విశ్వకర్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జన్మదిన వేడుకలు

విశాఖపట్నం జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);విశాఖపట్నం విశ్వకర్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశాఖపట్నం దేవి మాధవ్ బీచ్ రోడ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా జరిగా యి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి విశాఖ కార్పొరేషన్ 38 కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి నరసింహ చారి, రామోజు పెద్ద బాబు , ముదపాక రవి ,పెదపూడి బ్రహ్మాజీ ,ఈర్ని ప్రకాష్ , కట్టుమళ్ళ అనిల్ ఎస్ రాజేష్ చిట్టూరి తాతాజీ బీసీ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘ నాయకులతో పాటు తల్లిదండ్రులు మానేపల్లి శ్రీనివాసరావుమల్లేశ్వరి దంపతులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలకు విశ్వకర్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున అండగా ఉన్నామని మరిన్ని కార్యక్ర మాలతో భవిష్యత్తులో ముందుకు వెళ తామని దేవి మాధవ్ తెలియజేశారు

నిందితుల అరెస్టులో లేట్ చేయొద్దు.. క్రమశిక్షణ చర్యలుంటాయన్న సీపీ రంగనాథ్

వరంగల్, జులై 14:నమోదైన కేసుల్లో నేరానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయడంలో అధికారులు జాప్యం చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. పెండింగ్ కేసులపై ఇవ్వాల (శుక్రవారం) ప్రత్యేక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రంగనాథ్? మాట్లాడారు. పెండింగ్? కేసుల్లోని నిందితులు త్వరితగతిన అరెస్టు చేయాలన్నారు. నిందితుల అరెస్టు విషయంలో సమస్య వుంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. కేసు నమోదు అయిన నెల రోజుల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేయాల్సి వుంటుందని, లేకుంటే క్రమ శిక్షణ చర్యలు తప్పవని చెప్పారు. ఈ సమీక్షలో డీసిపిలు, ఏసిపిలు, ఇన్?స్పెక్టర్లు, సబ్-ఇన్?స్పెక్టర్లు హాజరయ్యారు.

సాధరణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీస్ కమిషనర్ ఎక్సైజ్ పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు విభాగాల అధికారులు గత సంవత్సరం, ప్రస్తుత సంవత్సరంలో నమోదు చేసిన కేసులను సమీక్ష జరిపారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గుడంబా విక్రయాలతో పాటు, తయారీ అలాగే అక్రమ మద్యం నియంత్రణపై స్థానిక పోలీసులు ఎక్సైజ్ పోలీస్ విభాగం సంయుక్తంగా కల్సి పనిచేయాల్సి వుంటుందని, అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడే వ్యక్తులను బైండోవర్లు చేయడంతో పాటు, కేసులను నమోదు చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు, డిసిపిలు కరుణాకర్, అబ్దుల్ బారి, నీతారాం,పుష్పాతో పాటు పోలీస్, ఎక్సైజ్ విభాగాలకు చెందిన

పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల, జులై 14:(నేటినిజం ప్రతినిధి): ఈనెల 16 నుండి తెలంగాణ రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున చేపడుతున్నటువంటి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా టిఎస్ సిపిఎస్ఇయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజయకుమార్, నీలం సురేందర్ రెడ్డిలు కోరారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు సంబంధించిన గోడపత్రికను అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ మరియు సిపిఎస్ అధ్యాపకులతో కలిసి కళాశాల ఆవరణలో గోడ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర ఈ నెల 16న జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుండి ప్రారంభమై సిరిసిల్ల జిల్లాకు 26వ తేదీన చేరుకుంటుందని ఇట్టి రథయాత్రలో జిల్లాలోని సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని పాత పెన్షన్ పునరుద్ధరణకై ప్రభుత్వానికి ఒక గట్టి సందేశాన్ని ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, టిఎస్ సిపిఎస్ఈయు జిల్లా అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి నీలం సురేందర్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం మల్లారెడ్డి, కే. రాజేష్, డాక్టర్ వి. వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం. ప్రభాకర్, గోపికృష్ణ, శాంతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ హైదరాబాద్‌తో మారనున్న నగర రూపురేఖలు : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

హైదరాబాద్, జులై 14: హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ బృహత్తర ప్రణాళికతో స్వచ్ఛ సర్వేక్షణ్‌ను చేపట్టారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని వైఎంసీఏ, లింగంపల్లిచౌరస్తా, కుద్బిగూడ, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డా, గోల్నాక డివిజన్‌లోని కొత్త బ్రిడ్జి, జిందాతిల స్మాత్ రోడ్, డీ మార్ట్‌లైన్, వడ్డెరబస్తీలల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, అధికారులతో కలిసి పర్యటించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌తో రూపు రేఖలు మూర్తిగా మారనున్నాయని, ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ కీర్తి మరింతగా పెరగనుందని పేర్కొన్నారు. ప్రజలు ఇంటి నుంచే తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి చెత్తరిక్షాలలో వేసి పరిశుభ్రతను పాటించి, స్వచ్ఛ సర్వేక్షణ్‌ను విజయవంతం చేయాలని కోరారు.

స్వచ్ఛత విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, భావితరాలకు దారి చూపలనే ఉద్దేశంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ వేణుగోపాల్, ఏఎంహెచ్ఓ జ్యోతిబాయి, ఈఈ పేరిరాజు, జీహెచ్ఎంసీ సిబ్బంది,బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మిగిలిన ముంపు గ్రామాల సమస్యల పరిష్కార దిశగా అడుగులు

-ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు

-106 మందికి ఇండ్ల పట్టాలను పంపిణీ

రాజన్న సిరిసిల్ల, జులై 14:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి ఇస్లామ్ నగర్ కు చెందిన 106 కుటుంబాలకు, సంకెపల్లి గ్రామానికి చెందిన 15 మంది కుటుంబాలకు ఇండ్ల పట్టాలను శుక్రవారం ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ వేములవాడ పట్టణం నలు వైపులా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. ముంపు గ్రామాల సమస్యలు కూడా ఒక సవాలుగా మారిందని సవాల్లను స్వీకరించి దీటుగా జవాబు చెప్పి ప్రజల వైపు ఉంటామన్నారు. అనునిత్యం ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ఇక్కడి ప్రజా ప్రతినిధుల, అధికారుల సహాయం మరువలేనిదని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ప్రధానమైన సాగునీరు, ముంపు గ్రామాల సమస్యలు, దేవస్థాన అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రతి నీరుపేదలకు న్యాయం చెయ్యడమే మా లక్ష్యం అని, రైల్వే లైన్ బాధితులకు కూడా నష్టపరిహారం విషయంలో నా సహకారం తప్పకుండా వుంటుందని అన్నారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ బీసీ బంధు, డబల్ బెడ్ రూం ఇండ్లు, దళిత బంధు అందజేస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ని ఇస్లాంనగర్ వాసులు పెద్ద ఎత్తున గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి, ఎం.పి.పి బూరవజ్రమ్మ, జెడ్.పి.టి.సి మ్యాకల రవి, వైస్ ఎం.పి.పి రామచంద్ర రావు, సెస్ డైరెక్టర్ హరి చరణ్ రావు, కౌన్సిలర్లు జడల లక్ష్మీ, యాచమనేని శ్రీనివాసరావు, ఇప్పపూల అజయ్, పట్టణ అధ్యక్షులు పుల్కం రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు, డైరెక్టర్ వీర్ మహమ్మద్, ఆర్.డి.ఓ పవన్ కుమార్, ఎం.ఆర్.ఓ రాజిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రాయన్-3 విజయవంతంపై కిడ్స్ కాన్వెంట్ విద్యార్థుల సంబరాలు

రాజన్న సిరిసిల్ల, జులై 14:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్లో చంద్రాయన్ 3 ను విద్యార్థులు ప్రత్యక్షముగా వీక్షించారు ఈ సందర్భముగా విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్తల కృషి గురించి బారత దేశం యొక్క గొప్పతనం గురించి వివరించడం జరిగింది చంద్రాయన్ 3 విజయవంతం అయినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. నిర్దేశిత కక్షలోనికి చంద్రయాన్ -3 ప్రవేశ పెట్టడంతో దేశం మొత్తం హర్షధాన్యాలు వెలువెత్తినాయి. ఈ సందర్భంగా చంద్రయాన్ -3 రాకెట్ నవ్వానాలతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. విజయం పట్ల ప్రిన్సిపాల్ ధరక్షన్ వసుపియ , కరస్పాండెంట్ నరాల దేవేందర్ ఇస్రో శాస్త్ర వేత్తలకు కృతజ్ఞతలు తెలియజేసారు

అభివృద్ధి పనులకు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన

హైదరాబాద్, జులై 14:ఘట్కేసర్ మున్సిపాలిటీలోని 16వ వార్డులో రూ.2 కోట్ల 6 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి గురువారం శంకుస్థాపనలు జరిపారు. దీనితో పాటే.. గ్రంథాల య శాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో నిర్వహిస్తున్న ఘట్‌కేసర్ గ్రంథాలయ భవన పునర్ నిర్మాణ పనులకు మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి మల్లారెడ్డి ఘట్‌కేసర్‌లో ప్రారంభించారు. ఈ కేంద్రంలో దాదాపు 30 మంది మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి వారికి మంత్రి ఉచితంగా కుట్టు మిషన్లను అందజేశారు.

నియోజక వర్గంలో దాదాపు 2 వేల మంది మహిళలకు కుట్టులో శిక్షణ ఇచ్చి మిషన్లను కూడా అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని స్థానికులతో కలిసి భారీ ఊరేగింపును నిర్వహించారు. వార్డు ప్రజలు, పెద్ద ఎత్తున మహిళలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గులాబీ రంగు కాగితాలను చల్లుతూ మంత్రికి స్వాగతం పలికి వార్డులో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో వైస్ చైర్మన్ పి.మాధవ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరావు, సెక్రెటరి మందాడి శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరి సుధాకర్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, రైతు సొసైటీ డైరెక్టర్లు రేసు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బండారి దాసు, పద్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలపై కార్యాచరణ చేయాలి:జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్

ఖమ్మం, జులై 14: (నేటినిజం ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలపై కార్యాచరణ చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి లోని సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ తో కలిసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవిన్యూ, పోలీస్, ఇంజనీరింగ్, ట్రాన్స్పోర్ట్ అధికారులు సమన్వయంతో రోడ్డు ప్రమాదాలపై కారణాలు విశ్లేషించి, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్యాత్మక రోడ్లను, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయడం, తగు జాగ్రత్తలపై కార్యాచరణ చేయాలన్నారు. కూడళ్లు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల వద్ద మార్కింగ్ చేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని, స్పీడ్ బ్రేకర్లు లేనిచోట ఏర్పాట్లు చేయాలని అన్నారు. కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద వైట్ కలర్ పెయింటింగ్, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఓవర్ లోడింగ్ వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలపై నిఘా పెట్టాలని, హెల్మెట్ ధరించేలా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కలిగించాలని ఆయన తెలిపారు. జిల్లాలో 69 బ్లాక్ స్పాట్ లను గుర్తించి, 53 బ్లాక్ స్పాట్ లను సరిదిద్దినట్లు ఆయన అన్నారు. ప్రమాదకర ప్రదేశాల్లో నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై నియతకాల సమీక్షలు చేపట్టాలన్నారు. జిల్లా రోడ్డు భద్రత కార్యాచరణ అభివృద్ధిపర్చాలన్నారు. ఎస్టీ ఎస్టీఎఫ్ క్రింద 2023-24 సంవత్సరానికి రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 15 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. హైవే రోడ్లపై 20 ప్రదేశాల్లో 40 బ్లింకర్లు ఏర్పాటుకుగాను ఇప్పటివరకు 6 చోట్ల 12 బ్లింకర్ల ఏర్పాటుచేసినట్లు, మిగతా బ్లింకర్ల ఏర్పాటు వారంలోగా పూర్తి చేయాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారిని చైతన్య పరచాలన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరంలో జూన్ వరకు మొత్తం 399 ప్రమాదాల కేసులు నమోదు అవగా, 130 మరణాలు సంభవించినట్లు తెలిపారు. బ్లింకర్ల వద్ద ప్రమాదాలు తగ్గుతున్నట్లు, అవసరమైన అన్నిచోట్లా ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదకర ప్రదేశాలను క్షేత్ర పరిశీలన చేసి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన కార్యాచరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి, శిక్షణా సహాయ కలెక్టర్ రాధిక గుప్తా, ఆర్ అండ్ బి, పీఆర్ ఇఇ లు శ్యామ్ ప్రసాద్, కెవికె. శ్రీనివాస్, నేషనల్ హైవే పిడి దుర్గాప్రసాద్, జిల్లా రవాణాధికారి కిషన్ రావు, జిల్లా వైద్యాధికారిణి డా. బి. మాలతి, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, ఎసిపిలు,మునిసిపల్ కమిషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియా చేరుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జులై 14:భారత జాగృతి ఆధ్వర్యంలో జరిగే బోనాలు పండుగ వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆస్ట్రేలియా చేరుకున్నారు.

బ్రిస్బేన్ నగరం చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు భారత జాగృతి ఆస్ట్రేలియా విభాగం నాయకులు ఘన స్వాగతం పలికారు.

సిడ్నీ, మెల్‌బోర్న్ నగరాల నుండి బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి నాయకులు వందల సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. తెలంగాణ జాగృతి ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు శ్రీకర్ రెడ్డి అందెం, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా విభాగం అధ్యక్షులు కాసర్ల నాగేందర్ రెడ్డి, బీటీఏ ప్రెసిడెంట్ కిషోర్, నాయకులు విజయ్ కోరబోయిన, స్వప్న దోమ, విరించి రెడ్డి, ఇతర నాయకులు ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలికారు. శనివారం ఉదయం 10 గంటలకు బ్రిస్బేన్ లోని గాయత్రి మందిరంలో జరగనున్న బోనాలు వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత, ఆస్ట్రేలియా మంత్రులు, ఎంపీలు పాల్గొననున్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా బీ.ఆర్.ఎస్ పార్టీ అండగా ఉంటుంది

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల, జులై 14:(నేటినిజం ప్రతినిధి): ప్రమాదాలలో మంజించిన రుద్రంగి గ్రామానికి చెందిన యిద్దరు కార్యకర్తలు లబ్ధిదారులైన అంబటి ధన రాజు, గగులోత్ లక్ష్మి కుటుంబాలకు 4 లక్షల భీమా చెక్కులు లను ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోఇప్పటివరకు 23 మంది కార్యకర్తల కుటుంబాలకు 46 లక్షలు అందచేశామని అన్నారు. భీమా మంజూరీకి సహకరించిన మంత్రిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టీ.ఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి గంగం స్వరూప , జెడ్.పి.టి.సి గట్ల మీణయ్య , సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం , గ్రామ శాఖ అధ్యక్షులు దయ్యాల కమలాకర్ ఎం.పి.టి.సీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన కళాకారులు

రాజన్న సిరిసిల్ల, జులై 14:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సంగీత నిలయంలోని ఎమ్మెల్యే డాక్టర్ రమేష్ బాబును శుక్రవారం జిల్లా సమాఖ్య కళాకారులుమర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 16 తేదీ ఆదివారం వేములవాడ పట్టణంలోని పద్మశాలి సంఘ భవన్ నందు కళాతపస్వి ఎల్లా పోశెట్టి బయోపిక్ చిత్రీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావాలని ఆహ్వానించి కళాతపస్వి ఎల్లా పోశెట్టి బయోపిక్ చిత్రీకరణ ఆహ్వాన కార్డును అందజేయడం జరిగింది. కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో కళా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులుఎల్లా పోశెట్టి జిల్లా సమాఖ్య అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య సేవా సంస్థ అధ్యక్షులు మానవాడ లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులు మిద్దె వినీత్ తదితరులు ఉన్నారు.

మహిళలకు భద్రత.. భరోసా-హోంమంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, జులై 14:మహిళల భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో దేశ వ్యాప్తంగా తెలంగాణ పోలీసులకు బెస్ట్ పోలీస్‌గా గుర్తింపు వచ్చిందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ), హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన స్త్రీ సమ్మిట్- 2023ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ (ఎస్‌టీఆర్‌ఈఈ) సమ్మిట్ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదన్నారు. భిన్న సంస్కృతులకు నిలయమైన హైదరాబాద్ మహానగరం ప్రశాంతంగా ఉండేలా హైదరాబాద్ పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని, ప్రధానంగా మహిళలకు సురక్షితమైన ప్రదేశంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నారని అన్నారు. ప్రతి మహిళ విద్యావంతురాలైతే రాష్ట్రం పురోగతి చెందుతుందని సీఎం కేసీఆర్ విశ్వసిస్తూ మహిళాభివృద్ధి, రక్షణతో పాటు విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని హోంమంత్రి అన్నారు. నగరంలో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరిగితే వెంటనే గుర్తించే విధంగా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి, ప్రపంచంలోనే సురక్షితమైన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా తీర్చిదిద్దామన్నారు. మహిళల రక్షణకు షీ టీమ్స్, భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. మహిళల రక్షణకు తోడ్పడుతున్న ప్రతి పోలీసుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో మహిళలు ఏ సమయంలోనైనా స్వేచ్ఛ గా తిరిగే వాతావరణం ఉన్నదని, మహిళల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవడమే ఇందుకు కారణమని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడు తూ.. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ లాభాపేక్ష లేకుండా పనిచేస్తు న్నదని, ప్రజలకు, ప్రభుత్వానికి అనుబ ంధంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్త్రీల యొక్క గౌరవం, సమానత్వం, సాధికారితను పెంపొందించడం ఈ స్త్రీ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమన్నారు. మహిళల రక్షణ కోసం పోక్సో, షీ టీమ్స్, ఉమెన్ సేఫ్టీ వింగ్ వంటివి తెలంగాణలో సమర్థవంతంగా పనిచే స్తు న్నాయని అన్నారు. 174 ఏళ్లలో మొదటి మహిళా ఎస్‌హెచ్‌ఓగా లాలా గూడ ఠాణాకు మధులతను నియ మించామని సీపీ గుర్తు చేశారు. స్త్రీ సమ్మిట్‌లో కీలక అంశాలు ఉన్నాయని, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్, ఉమెన్ ఫోరమ్, ట్రాఫిక్ ఫోరమ్, యాంటీ నార్కొటిక్ ఫోరమ్, సెక్యూరిటీ తదితర ఫోరమ్స్ ద్వారా వివిధ అం శాలపై హెచ్‌సీఎస్‌సీతో కలిసి ప్రజల లో అవగాహన కల్పిస్తున్నా మన్నారు. ఏఐజీ దవాఖాన చైర్మన్ డి.నాగేశ్వ ర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐజీలో పనిచేస్తున్న సిబ్బందిలో 60 శాతం మహిళలు ఉన్నారని, వారి విధేయత, చిత్తశుద్ధి విజయాన్ని సాధించడానికి ప్రేరేపిస్తున్నదన్నారు. స్త్రీల మెదడు బహుళ- పని, హేతుబద్ధమైన రీతిలో పనిచేస్తుందనడానికి బలమైన ఆధారాలు ఉన్నాయన్నారు.

ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ మరియు
పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో
జాలాది రత్నసుధీర్ రచించిన కథాసంకలనం
మనసు పలికిన ...

ఆవిష్కరణ సభ
సభాధ్యక్షత : శ్రీ.సి.ఎస్. రాంబాబు (కథారచయిత)
ముఖ్య అతిథి - ఆవిష్కర్త : ఆచార్య కొలకలూరి ఇనాక్ (పూర్వ ఉపకులపతి - శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం) పద్మశ్రీ పురస్కార గ్రహీత
ఆత్మీక అతిథులు : శ్రీ.ఎ. దినకర బాబు, ఐఏఎస్. రిటైర్డ్
శ్రీ విహారి, రచయిత, విమర్శకులు
శ్రీ గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట, సాహిత్య మాసపత్రిక
వేదిక
రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ (మొదటి అంతస్థు), హైదరాబాద్
సమయం: 21-07-2023, శుక్రవారం, సాయంత్రం 6.00 గంటలకు

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.